GIRDHARI, RNI Regn.No.TELTEL/2021/80612, Date of Pub - 25th of every month
Date posting - 1st of every month at BPC-IV, Patrika Channel, HYD - 01
Postal Regn.No.HQ/SD/525/2024-2026; Licensed to Post without prepayment
WPP No.PMG/TS/HQR/SC-04/WPP/2024-2026





Edited, printed, published and owned by Swami Sundara Chaitanyananda, Printed at M/s Karshak Print Solutions Pvt. Ltd., Moula Ali, Hyd - 500 040.

IF UNDELIVERED PLEASE RETURN TO :

SUNDARA CHAITANYA ASHRAM
HYDERABAD - 500 043

గిరిధారి

సెప్టెంబరు 2025

శాశ్వత చందా రూ.1200/-
10 సం॥ లకు



ఆశ్రమంలో శ్రీకృష్ణాష్టమి 16-8-2025







ప్రార్థన




శ్లో॥ స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం
న్యాయేన మార్గేణ మహీం మహీశాః ।
గో బ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం
లోకా స్సమస్తా స్సుఖినో భవన్తు ॥

జనావళికి శుభము కలుగు గాక! పాలకులు ధర్మమార్గాన భువిని పరిపాలించెదరు గాక! గోవులకు, జ్ఞానులకు సదా శుభము కలుగు గాక! సమస్త లోకము సుఖించును గాక!

శ్లో॥ కాలే వర్షతు పర్జన్యః
పృథివీ సస్య శాలినీ ।
దేశోయంఒ క్షోభరహితః
బ్రాహ్మణా స్సన్తు నిర్భయాః ॥

మేఘములు సకాలములో వర్షించుగాక! భూమాత పుష్కలంగా పంటలతో శోభించు గాక! దేశము దుర్భిక్షము నుండి విముక్తిని పొందు గాక! జ్ఞానవంతులు నిర్భయులై చరించెదరు గాక!

పండుగలు



30-8-2025 - దుర్గాష్టమి

గీతాధారి

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి : 40 సంచిక : 10

వ్యవస్థాపకులు :
శ్రీ స్వామి సుందర చైతన్యానంద

ఇందులో

సంపాదకులు : శ్రీ స్వామి సుందర చైతన్యానంద


జీవిత సభ్యత్వం - రూ. 1200 /-
(10 సంవత్సరములు)

డి.టి.పి. & కవర్ డిజైన్
సుందర చైతన్యాశ్రమం, హైదరాబాద్

ప్రింటింగు : బైండింగు
కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్

వివరములకు : సుందర చైతన్యాశ్రమం,
దుండిగల్ రోడ్, హైదరాబాద్ - 500 043. ఫోన్:(08418)255777, 9100908777

Visit us at : www.sundarachaitanyam.com (*email : admin@sundarachaitanyam.org*)



ఆప్తవాక్యం

వెన్నెల పాలవెల్లి

అంబరాన్ని అంటే నా ఆలోచనల వెనుక
అబ్ధిని కుదిపే నా సంకల్పాల నడుమ
అవనిని కదిపే నా ఆశల మాటున
యుగయుగాలుగా ప్రభో! ఎలా ఒదిగిపోయావు?

జగమంతా చీకట్లు ముసురుకున్నప్పుడు
వత్తు లేసుకొని నాలో తొంగి చూచిందెవరు?
మూతబడిన నా నయనాల తిమిరాలలో నిల్చొని
మౌనంతో నన్ను పలకరించిందెవరు?

దాగిందెవరు? చెప్పు!
నిన్ను నాలో దాచిందెవరు?
దాగేవాడు దొంగయితే
దాచేవారు దొరలా?


నీవెప్పుడూ నాతోనే ఉన్నా
నేనెప్పుడూ నీతో ఉండలేకపోతున్నా

ప్రతిక్షణం నీవు నన్ను పిలుస్తున్నా
మరుక్షణంలో నేను పడిపోతున్నా

ఒంటరిగ నీతో మాట్లాడాలనుకుంటున్నా
ఒంటరినై మాట్లాడే దెలాగో తెలియక పడిఉంటున్నా

నిన్ను చేరే ఆలోచన చెయ్యాలనుకున్నా
ఏమైందో గాని ఆలోచనను ఎక్కడో పారేసుకున్నా

గాలిమేడలుగా ఎందరికి అగుపించినా
గాలి భాషలోనే నేను ఆలపిస్తున్నా



నీటి మూటలుగా మరెందరికి కనిపించినా
నీటి పైటనే నేను పట్టుకొని ఉన్నా

అంతమెక్కడో తెలియదని అందరంటున్నా
నా ఆంతర్యంలోనే అంతా ఉన్నదంటున్నా


నీ నిద్రకు భంగమని పలుకలేకున్నా
నీవు పిలిచినపుడు ఆదమరచి నిద్రపోతున్నా



ప్రభో!
మట్టిలోనే చెట్టు నిలిచి ఉన్నా
చెట్టు చుట్టూ మట్టే ఉన్నా
ఒట్టేసి మరీ చెప్పమంటున్నా
వట్టిమాటలు ఇక వద్దంటున్నా!

మల్లెలు మహిలో విరిసినా
నా ఊహాల నవి తాకలేవని
జాడ తెలుపక జారుకుంటున్నా
జతగా నిన్ను చేరుకుంటున్నా!

వెన్నెల భువిలో కురిసినా
నా భావాలను తడుపలేదని
తలుపులు మూసి మరీ పోతున్నా
నీ తలపులతో నిండిపోతున్నా!



చిరుగాలి ఎంతగా తిరిగినా
నా చిరునామా దొరకదని
మాట పడేసి పోతున్నా
మాట మూలాన పడి ఉంటున్నా

పైరు పచ్చగ ఎదిగినా
ఎగిరి నన్ను పట్టలేదని
ఎరుక పరచి పోతున్నా
ఎరుకలోనే నేనుంటున్నా!



మేఘాలు చుట్టు మూగినా
దోగాడే నన్ను నిలపలేవని
దారి చూపే తారకలను
దారిలో ఎవరూ ఆపలేరని
అన్నీ వదిలిపోతున్నా
నిన్ను వదలలేక నేనున్నా!

వేదనలు వెన్ను విరుస్తున్నా
ప్రార్థనలు పలుకుతూనే ఉన్నా
ఆవేదనలు అడ్డు నిలుస్తున్నా
ఆరాధనలు ఆపకుండా ఉన్నా

నిశీధి నన్ను చుట్టేసినా
నీరాజనంతో నీ మోము చూస్తూనే ఉన్నా
సహృదయు లెందరు పిలిచినా
హృదయంలో నీతోనే పలుకుతున్నా!

నా హృదయ సదనములో
సదా మెరిసే వదనము నీదే
నా హృదయ గగనములో
సర్వదా విరిసే వెన్నెల నీదే.



ప్రభో!
మనస్సు విప్పి నేను చెబుతున్నా
మనస్సు పెట్టి నిన్ను వినమంటున్నా
పాలుపోక పాలుగొంటానే గాని
పనిగట్టుకొని పాలు పంచుకోను.

కురిసింది మదిలో నీ ప్రేమజల్లు
తనకు తానుగా అదే శాంతిని వెదజల్లు
నా హృదిలో వెలిసింది నీ వెన్నెల పాలవెల్లి
వేడుతూ ఉంటాను నా మాటల పూలు జల్లి.

ॐ స్వామి సుందర చైతన్యానంద

ఏదిరా గోపాలా!

(చైతన్య గానం - 9)

శ్రీమతి సి.పద్మ



పల్లవి: ఏదిరా! గోపాలా!
నాదలోల! నందబాల!
ఏదిరా గోపాల! ॥ ఏదిరా ॥

అనుపల్లవి:
నిముషమైన నిను వీడని
అద్భుత అసమాన మురళి ॥ ఏదిరా ॥

చరణములు:

1. విరుల కురుల వగలు జూచి వీచికలకు రుచులు పంచి
మది కరిగే మధురవార్త మగువల కందించు మురళి
ఏదిరా గోపాలా! గానలోల గోపాల! ॥

2. గలగల మని కొలను జలము పులకరించెను పూలవనము
వల పన్నిన రాధ వలపు రాగమైన మురళి పిలుపు
ఏదిరా గోపాలా! నాదవేద వేణునాద మేదిరా గోపాల! ॥

3. ఉన్నచోటే పరతు నీకు పొన్నపూల శయ్య నేను
కలుగులు గల కన్నె మురళి వెలుగులు విరజిమ్ము రవళి
ఏదిరా గోపాల! విశ్వమోహన వేణుగాన మేదిరా గోపాల! ॥

4. దొరను చేరిన సుందరాంగి తొంగి చూడదు దొంగమురళి
విధిరాతకు ఎవరు బాధ్యులు? ఉన్నవారికి లేవు బాధలు
ఏదిరా గోపాల! వేదనాద సునాద మురళి ॥

గోవిందుడు చరించిన బృందావనం పుణ్యక్షేత్రం. శ్రీకృష్ణుడు క్రీడించిన యమునా తీరం పుణ్యతీర్థం. గోపాలునితో ఆడి పాడిన గోపగోపీ జనులు కృతపుణ్యపుంజులు. కేశవుని కీర్తించు జీవులే పుణ్యజీవులు.

గానం ఆనందానికి సంకేతం. వసంత ఋతువులో లేత చిగుళ్ళు తింటూ కోయిల గానం చేస్తుంది. ఆనంద సమయాల లోనే మనిషి పాడగలడు. విషాదంలో విలపించగలడే గాని రాగాన్ని ఆలపించలేడు. నువ్వు అందంగా ఉన్నావా? అని ఈ ప్రపంచంలో ఎవరూ ఎవరినీ అడగరు. అందం బాహ్యానికి సంబంధించింది కనుక అది చూసేవారి దృష్టిపై ఆధారపడి ఉంటుంది. నువ్వు ఆనందంగా ఉన్నావా? అని మనిషి మనిషిని పరామర్శిస్తాడు. ఆనందం ఆంతర్యానికి సంబంధించింది కనుక ఎవరి ఆనందానికి వారే సాక్ష్యులు.

లోన ఆనందం లోపించిన వ్యక్తి బయటకు ఆనందాన్ని ఎలా వ్యక్తం చేయగలడు?

మల్లెపువ్వే సువాసనను వెదజల్లగలదు. వెలిగే దీపమే వెలుగును విరజిమ్మగలదు. తమలో ఆనందం ఉన్నవారే ఇతరులకు ఆనందాన్ని పంచగలరు. ఆనందం ప్రాణులకే గాని రాయి రప్పకు లేదు. ఆనందించగల మనస్సు మనిషికి ఉన్నా, ఎల్లప్పుడూ ఆనందంగా ఉండలేడు. మనిషి ఆనందం దేశంపై, కాలంపై, సన్నివేశాలపై, వ్యక్తులపై, విషయాలపై, వస్తువులపై ఆధారపడి ఉంటుంది. అంటే, ఒక కారణం వల్ల కలిగే ఆనందం అని అర్థం. కారణం వల్ల కలుగుతూ ఉంది కనుక కారణం దూరమైతే ఆనందం కూడా దూరమవుతూ ఉంది. వచ్చిపోయే ఆనందం వల్ల మనిషికి తాను ఆశించే నిత్యతృప్తి లభించదు.

'కృష్' అంటే సదా. 'ణ' అంటే ఆనందం. 'కృష్ణ' అంటే ఎల్లప్పుడూ ఉండే ఆనందమని అర్థం. సదానంద స్వరూపుడైన శ్రీకృష్ణుడే సర్వులకు, సర్వ వేళలా ఆనందాన్ని పంచగలడు. అందుకే బృందావన పుణ్యభూమిలో శ్రీకృష్ణుడు చేసిన మురళీగానం సుధామయం. గోపికల మనస్సులను ప్రేమానురాగాలతో నింపిన వంశీమోహనుని మురళీనాదం అమృతమయం.

మురళీగానం విన్న హృదయాలు ద్రవించేవి. గోవులు రెప్పలు వాల్చేవి కావు. దూడలు పాలు త్రాగేవి కావు. జింకలు చిందులు వేయవు. నెమళ్ళు నాట్యమాడవు. పక్షులు కిలకిల లాడవు. యమున అలలు కదలవు. మేఘాలు మౌనం వహిస్తాయి. వనాలు నిశ్చలమై నిలుస్తాయి. ఇదంతా దేనికి? ఒళ్ళంతా చెవులు చేసుకొని వేణునాదాన్ని వినేందుకే.

నిత్యము శ్రీకృష్ణుని అధరామృతాన్ని గ్రోలుతూ చల్లని ఆయన చేతి స్పర్శకు నోచుకున్న మురళి పుణ్యజీవి. ఊదితే పెదవులపై ఆడుతూ, చేతులలో ముచ్చటగా కదులుతూ, ఊదకుంటే మొలలో ఒదిగి ఉండే మురళి, శ్రీకృష్ణుని దివ్య దేహాన్ని క్షణమైనా ఎడబాయని ధన్యజీవి. ఆనాటి మురళీగానం నేడూ ఉంది. హృదయమనే బృందావనంలో వినపడుతూనే ఉంది. భక్తుల గుండెలలో ప్రేమగీతంగా, వక్తల గొంతులలో గీతా సందేశంగా ఈనాటికీ ప్రపంచంలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. అందుకే,

ఏదిరా గోపాలా! నాదలోల! నందబాల!
నిముషమైన నిను వీడని అద్భుత అసమాన మురళి ॥

అంటూ, వినగల వీనులలో వినిపించమని, కనగల కన్నులలో కనిపించమని సామగాన లోలుని, నందగోపబాలుని మనసార ముదమార పిల్లనగ్రోవిని ఊదమని పిలుస్తున్నారు పూజ్య స్వామిజీ.

గాలికి చెట్లు వింజామరలు వీస్తాయి. పూలవానలు కురిపిస్తాయి. పూల సువాసనను గాలి మోసుకెళ్తుంది. దూర సందేశాలను తీసుకొస్తుంది. కృష్ణ విరహంలో తపించే గోపికలకు మురళీ మధురనాదం వినిపిస్తే చాలు - నల్లని వాలుజడలలో మల్లెలు తురుముకొని, కాలి అందియలు ఘల్లుఘల్లు మన, మురళీనాదంతో శ్రుతి కలిపి అందంగా అడుగులు వేస్తూ యమునాతీరానికి తరలి వచ్చేవారు. వినిపించే మురళిని వెంబడిస్తూ, కనిపించని కృష్ణుణ్ణి వెదకుతూ అలసి సొలసి పోయేవారు. ఆర్తితో పిలిచేవారు. విరహగీతాలు ఆలపించేవారు. గోపికల అలంకారము శ్రీకృష్ణుని కోసమే. గోపికల అనురాగము శ్రీకృష్ణుని పైనే. కృష్ణుడు వచ్చాడనే మధురవార్తను గోపికలకు అందించి, తీరా వారు పరుగు పరుగున వస్తే, మురళి,

కృష్ణుడు ఇరువురు తోడుదొంగలై ఎవరికీ కనిపించకుండా వెదురు పొదలలో దాగిపోయేవారు. అందుకే,

విరుల కురుల వగలు జూచి, వీచికలకు రుచులు పంచి
మది కరిగే మధురవార్త మగువల కందించు మురళి
ఏదిరా గోపాలా! గానలోల గోపాల! ॥

అంటూ, రేయింబవళ్ళు శ్రీకృష్ణుని పదసరోజాల చుట్టూ పరిభ్రమించే భ్రమరాలే గోపికల హృదయాలు కదా! మరి మురళి ఉన్నది ఊరుకున్న వారిని ఉసిగొలిపేందుకే గాని, పిలిస్తే పలికేందుకు కాదా? అని ప్రశ్నిస్తున్నారు పూజ్య స్వామీజీ.

జాలరి వల చేపలను పడుతుంది. ప్రేమ వల పరమాత్మను బంధిస్తుంది. భగవంతుణ్ణి పట్టేందుకు భక్తులు నామంతో వలను పన్నాలి. వలపు వలను పన్నాలి. 'వలను చిక్కగా అల్లాలి. రంధ్రాలు ఏ మాత్రం పెద్దగా ఉన్నా చేపలు జారిపోయినట్లే, భగవంతుడు కూడా జారిపోతాడు' అని పూజ్య స్వామిజీ నామ వైశిష్ట్యాన్ని ఒకప్పుడు అందంగా వివరించారు. కొండలలో శబ్దం ప్రతిధ్వనించినట్లు, అద్దంలో బింబం ప్రతిబింబించినట్లు, రేయనక, పగలనక సాగే భక్తుడి వలపు భగవంతుడిని అహర్నిశం పిలుస్తూనే ఉంటుంది. పరమాత్మను తలచువారి కన్నా పరమాత్మ తలపులలో నిలుచువారు పుణ్యాత్ములు, పవిత్రాత్ములు. వారే నిత్యభక్తులు. అన్యాశ్రయాలను త్యజించినవారు. పరమాత్మనే పరమావధిగా భావించినవారు. శ్రీకృష్ణుని వేణునాదం లోకాలను మోహింప చేసింది. గోపాలురను ఆడించింది. గోపికలను తన్మయులను చేసింది. మహర్షులను ధ్యానమగ్నులను చేసింది. అందుకే,

గలగల మని కొలను జలము పులకరించెను పూలవనము
వల పన్నిన రాధ వలపు రాగమైన మురళి పిలుపు
ఏదిరా గోపాలా! నాదవేద వేణునాద మేదిరా గోపాల! ॥

అంటూ, విరహంలో తపించే గోపికలకు భావరాగాలు వినిపించిన వేణువు ఏదో కాదు, వేదనాదమే, ఉపనిషత్ విజ్ఞాన సారమే నని వేణుగానం యొక్క తాత్త్విక రహస్యాన్ని విప్పి చెబుతున్నారు పూజ్య స్వామీజీ.

ఎక్కడికో వెళ్ళి భగవంతుణ్ణి ఆరాధించాలని, ఏదో చేసి తన భక్తిని వ్యక్తం చేయాలని సామాన్య భక్తుడు నిరంతరం ఆరాటపడుతూ ఉంటాడు. నా కన్నా అన్యమైన వ్యక్తులను మెప్పించేందుకే ప్రదర్శనలు, పరామర్శలు అవసరం అని తెలుసుకోలేడు. నా ఉనికికి ఆధారమైన భగవంతుడు నా హృదయం లోనే ఉన్నాడు. భగవంతుడు సాక్షాత్తు నా స్వరూపం. నా కన్నా వేరు కాని వాని నుండి ఆలోచనలను దాచడం సాధ్యపడదు. నా కన్నా అన్యంగా లేని వానిని చేతలతో మెప్పించడం వీలు పడదు. ఉన్నది తానే. ఈ నేనూ తానే

అన్న ఎరుక ఒక్క జ్ఞానికే సాధ్యం. అన్ని సాధనల యొక్క ఫలం జ్ఞానమే. సర్వ శాస్త్రాల యొక్క తాత్పర్యం మోక్షమే.

పంచేంద్రియాలు, మనస్సు, బుద్ధి అనే ఏడు రంధ్రాలతో కూడుకున్న ఈ దేహమే వేణువు. మనిషి లోని అజ్ఞానం అహంకార రూపంలో ఈ ఏడు కలుగుల ద్వారా వ్యక్త మవుతూ ఉంటుంది. మనలోని అహంకారం కారిపోతే సప్త కలుగుల ద్వారా సప్త స్వరాలను పూరించి విశ్వమోహన వేణుగానాన్ని శ్రీకృష్ణుడు మన ద్వారా కూడా ఆలపిస్తాడు. అందుకే,

ఉన్నచోటే పరతు నీకు పొన్నపూల శయ్య నేను
కలుగులు గల కన్నె మురళి వెలుగులు విరజిమ్ము రవళి
ఏదిరా గోపాల! విశ్వమోహన వేణుగాన మేదిరా గోపాల! ॥

అంటూ, నేనంటూ, నాదంటూ మిగలక మురళిలా ఖాళీ కాగలిగితే మన నుండి వ్యక్తమయ్యే ప్రతి భావన, ప్రతి కర్మ శ్రీకృష్ణునిదే అనే పరమ సత్యానికి పూజ్య గురుదేవుల జీవితమే మనకు ప్రత్యక్ష నిదర్శనం అని ఈ చరణం మనకు బోధిస్తూ ఉంది.


కల నుండి మేల్కొన్న వాడిని కల లోని విషయాలు వేధించవు. జ్ఞానోదయంలో మేల్కొన్న వాడిని అజ్ఞాన చీకట్లు బాధించవు. త్రాడును త్రాడుగా చూచిన వాడికి పాము భయం లేదు. నేనే దేవుడని ఎరిగిన వాడికి జీవభ్రాంతి లేదు. భ్రాంతి దూరమైన వాడిలో భయశోకాలకు తావు లేదు. ఎంత దీర్ఘ స్వప్నమైనా మేల్కొన్న క్షణాన అదృశ్యం. ఎన్ని జన్మల అజ్ఞానమైనా జ్ఞానం కలిగిన క్షణాన మటుమాయం. వెదురు పొద నుండి ఖండింపబడి, కలుగులకు బలి అయి, అనేక బాధలను ఓర్చిన మురళి, నాథుని కరకమలాలలో ఒదిగిపోయిన క్షణాన తన బాధనంతా మరచిపోతుంది. ఆయన మృదుమధుర స్పర్శలో పరవశిస్తూ పడిన బాధలన్నీ ఇందుకేనా, ఈ హాయి కోసమేనా అని మురిసిపోతుంది. మురళి వ్యథను బాపుటకే శ్రీకృష్ణుడు మెల్లగా ఊదుతాడు. పడిన బాధను మాన్పుటకే తన అధరామృతాన్ని మురళికి అనుగ్రహిస్తాడు. అందుకే,

దొరను చేరిన సుందరాంగి తొంగి చూడదు దొంగమురళి
విధిరాతకు ఎవరు బాధ్యులు? ఉన్నవారికి లేవు బాధలు
ఏదిరా గోపాల! వేదనాద సునాద మురళి ॥

అంటూ, ప్రారబ్ధఫలంగా బాధలు సంక్రమిస్తే పరమాత్మ అనుగ్రహఫలంగా బోధలు సంప్రాప్తిస్తాయి. విధి రాతలు మాయ మవుతాయి. బాధలలో విధిరాతలు మాయం. వేదాంత విజ్ఞానంలో సంచిత, ఆగామి కర్మలు అదృశ్యం అంటూ, వేదజ్ఞాన సారమైన వేణునాదం సంసార దుఃఖాలను ఉపశమింప జేసి, గోపికలనే జీవులను పరమాత్మతో కలుపుతుంది అనే దివ్య సందేశంతో పాటను ముగిస్తున్నారు పూజ్య స్వామీజీ.


జై జై గురుదేవ!


సుందర సత్సంగాలు - మురళీకృష్ణ మందిరాలలో కృష్ణాష్టమి వేడుకలు






తొర్రూరు







పాలకుర్తి నియోజకవర్గం శాసనసభ్యురాలు
శ్రీమతి మామిడాల యశస్విని రెడ్డి గారు






వెయ్యి భగవద్గీత గ్రంథాల వితరణ

జగద్గురు జీవితము

ధారావాహిని-5

స్వామి సుందర చైతన్యానంద

మనీషా పంచకం



వీణ ద్వారా వైణికుని ప్రతిభ వ్యక్త మవుతుంది. కుంచె ద్వారా చిత్రకారుని ప్రజ్ఞ వెల్లడవుతుంది. ఉలి ద్వారా శిల్పి వైదగ్ధ్యం ప్రదర్శిత మవుతుంది.

వైణికుడు వీణను, చిత్రకారుడు కుంచెను, శిల్పి ఉలిని ఎలా పరిశుద్ధంగా ఉంచుకుంటారో, అలాగే భగవంతుడు కూడా తన పరికరమైన భక్తుని పవిత్రంగా ఉంచుకుంటాడు, మాలిన్యం చేరకుండా కాపాడుకుంటాడు. అదే భగవంతుని అపూర్వ కరుణాశక్తి. భకుని ఏకైక దివ్యప్రాప్తి.

ఒకనాటి ఉషోదయాన పవిత్ర గంగానదిలో స్నాన మాచరించి విశ్వనాథుని దర్శనానికి బయలుదేరారు శ్రీ ఆదిశంకరాచార్యుల వారు. అదే సమయానికి వీధులను శుభ్రం చేసే ఒక అస్పృశ్యుడు నాలుగు కుక్కలను వెంట పెట్టుకొని ఆచార్యుల వారికి ఎదురుగా వచ్చాడు. అతనిని చూడగానే శంకరుల మనస్సు కలవర పడింది. విశ్వనాథుని దర్శనానికి వెళ్ళే సమయంలో అతడిని దర్శించ వలసి వచ్చిందని భావించి 'దూరంగా వెళ్ళు . . . దూరంగా వెళ్ళు' అని గర్జించారు శ్రీ శంకరులు. అతడు విస్మయం అభినయిస్తూ, మందహాసం చిందిస్తూ ఇలా పలికాడు.

అన్నమయా దన్నమయ మథవా
చైతన్య మేవ చైతన్యాత్ ద్విజవర! దూరీ
కర్తుం వాఞ్ఛసి కిం బ్రూహి గచ్ఛ గచ్ఛేతి

'ఓ బ్రాహ్మణోత్తమా! మీరు ఎవరిని దూరంగా వెళ్ళ మన్నారు? దేహాన్ని దేహానికి దూరంగా పొమ్మంటారా! లేక చైతన్యం నుండి చైతన్యాన్ని దూరం చేయ మంటారా? శరీరా లన్నీ అన్నమయాలు, పాంచభౌతికాలు. కనుక అవి ఒక దాని నుండి మరొకటి దూరం కానవసరం లేదు. అలా గాక చైతన్యం నుండి చైతన్యాన్ని దూరం చేయటం మీ అభిమత మైతే సర్వగతమైన చైతన్యం ఎలా దూరం కాగలదు? అద్వయమైన ఆత్మ ఎలా దూరం కావాలి? ఎవరికి దూరం కావాలి?'.

సూర్యుడు గంగాజలంలో ప్రతిబింబిస్తాడు. అలాగే 'అస్పృశ్యుడు' నివసించే ప్రదేశంలో

గల మురికి గుంటలో కూడా ప్రతిబింబిస్తాడు. అంత మాత్రాన సూర్యునిలో భేదం ఏర్పడుతుందా? ఆకాశం స్వర్ణపాత్ర లోను, మట్టిపాత్ర లోను భాసిస్తుంది. ఆకాశంలో భేదం కనిపిస్తున్నదా?

'అనంతం, అద్వయం, నిరవధికం, నిరంజనం అయిన ఆత్మలో మీకు ద్వైతం ఎలా గోచరించినది? ఇతడు ద్విజుడు, అతడు అంత్యజుడు అనే భేద భ్రాంతి మీకు ఎలా కలిగింది?' అని అతడు శంకరులను ప్రశ్నించాడు.

అతడి వచనాలతో శంకరులకు కనువిప్పు కలిగింది. తన హృదయాకాశాన్ని క్రమ్మిన భేదభావ మేఘం అతని జ్ఞానవచన ఝంఝూమారుతం వల్ల చెదిరి పోయింది. శ్రీ శంకరులు సత్యం గ్రహించారు. భేదం త్యజించారు. 'నీవు అస్పృశ్యుడివి కావు. నీవు జ్ఞానరూపుడివి' అని పలుకుతూ అతడికి చేతు లెత్తి నమస్కరించి అక్కడే ఆశువుగా అయిదు శ్లోకాలు చెప్పారు ఆచార్యులు. అదే 'మనీషా పంచకం'. అస్పృశ్యు డైనా సమదర్శనం కలిగితే అతడే తన ఆచార్యు డని పలికారు. శుద్ధ చైతన్య స్వరూపంలో భేదం అవాంఛనీయ మని తెలిపారు.

యా తిర్యఙ్ నరదేవతాభి రహమిత్యన్తః స్ఫుటా గృహ్యతే
యద్భాసా హృదయాక్ష దేహ విషయా భాన్తి స్వతోఽ చేతనాః
తాం భాస్యైః పిహితార్క మణ్డల నిభాం స్ఫూర్తిం సదా భావయన్
యోగీ నిర్వృత మానసో హి గురురిత్యేషా మనీషా మమ

ఏ తత్త్వాన్ని 'నేను' యని మృగ నర దేవతాదులు ఆంతర్యంలో అనుభ విస్తున్నారో, ఏ చైతన్య ప్రకాశం వల్ల జడములైన దేహేంద్రియ మనోబుద్ధులు ప్రకాశిస్తున్నాయో, ఏ దివ్య చైతన్యం, మబ్బుల మాటున సూర్యుడుండి సమస్తాన్ని ప్రకాశింప చేస్తున్నట్లు స్వప్రకాశమై భాసిస్తున్నదో, అట్టి చైతన్యాన్ని ఏ యోగి భావన చేస్తూ, ప్రశాంతచిత్తుడై ఉంటాడో అతడే నా గురువు అని నా అభిప్రాయం.

ఇదే మనీషా పంచకం. మనీషా అనగా అభిప్రాయ మని భావం. అస్పృశ్యుడిలో బ్రాహ్మణునిలో ఏకత్వం దర్శించే దివ్య స్థితిని ఈ మనీషా పంచకం మనకు ప్రసాదిస్తుంది.

నాలుగు కుక్కలతో ఉన్న 'అస్పృశ్యుడు' అదృశ్యమై నాలుగు వేదాలతో పరమశివుడు దర్శన మిచ్చాడు. శ్రీ శంకరులను ఆశీర్వదించాడు. ప్రస్థానత్రయానికి భాష్యం రచించటం ద్వారా ప్రజలలో ఏర్పడిన భేదభావాలను, మూఢ విశ్వాసాలను పోగొట్టి జ్ఞానం ప్రసాదింపు మని తెలిపి ఆదిదేవుడు అంతర్హితు డయ్యాడు. ఈ సందర్భంలో శంకరులు పలికిన మనీషా పంచకం అర్థం చేసుకొని జీవించేవారు మనీషులుగా మారి, భేదభావ వర్జితులై సమదర్శన వీక్షణతో మహర్షులుగా మారగల రనడంలో సంశయం అవసరం లేదు.

(16వ పేజీ చూడుము)

మంగళ దీపాలు

ధారావాహిని-18

స్వామి సుందర చైతన్యానంద

కృపణుడు - కృపాకరి

శ్లో॥ శూరత్వం జామి వైధవ్యాత్
ఉదారమవ మానవాత్ ।
సా పత్న్యాత్ పండితమపి
తస్మాత్ కృపణ మాశ్రయే ॥

భావము :
'శూరుడైన వానిని ఆశ్రయిస్తే వైధవ్యం కలుగవచ్చు. ఉదారుని ఆశ్రయిస్తే అతడు పరులపాలు చేయవచ్చు. పండితుని ఆశ్రయిస్తే సరస్వతితో సవతిపోరు రావచ్చు. కనుక నేను లోభివాని నాశ్రయిస్తాను' అన్నదట లక్ష్మీదేవి.

వ్యాఖ్య

లోభము విచిత్రమైన గుణము. లోభి విడ్డూరమైన వ్యక్తి. లోభివాని కన్నా ధోబియే నయం. మలిన వస్త్రాలను శుభ్ర పరచేవాడు ధోబి, శుభ్రంగా యున్న ధనరాశులను దాచి యుంచి మలిన పరచేవాడు లోభి. ధోబి తన వద్ద ఏది ఉంచుకోడు. లోభి తనదంటూ ఏదియు ఖర్చు పెట్టడు.

లోభివాని ప్రవృత్తి చిత్రమైనది. తాను ఏ మంచి పని చేయలేడు సరి కదా చేసే వానిని చూసి కూడా ఓర్వలేడు. తన సంపదతో మురిసి పోవడం కన్నా మెరిసిపోయే ఇతరుల సంపదను గాంచి సహించలేడు. వారి కలిమి కూడా తన ఇంటిలో కులికితే బాగుండునని ఆశ పడుతుంటాడు. మేఘము వర్షించినా కన్నీళ్ళు కురిపిస్తాడు. వాడే లోభి. ఊహలకు అందని ఊరపిచ్చుక. అనవసరంగా నీటిని మేఘము నేల పాలు చేస్తుందని దుఃఖిస్తాడు. నేలకు నింగికి ఉండే సంబంధం, నీతి బాహ్య సంకల్పాలతో, అసూయా ద్వేషాలతో క్రుంగే ఈ వ్యక్తికి ఏమర్థమవుతుంది? పరోపకార జీవనము, సామరస్య దృక్పథము అతనికి తెలిసి వచ్చేది ఎప్పుడు?

లోభము ఒక దుర్గుణము. ఇది పోగొట్టుకోమని తెలిపేందుకే నిత్యము బిచ్చగాడు మన గృహానికి వస్తాడని శాస్త్రము చెబుతుంది.

అదాన దోషేణ భవే దరిద్రః

'గత జన్మలలో ఏ దానము చేయని దోషానికి నేను దరిద్రుడ నయ్యాను అని తెలిపేందుకే బిచ్చగాడు వస్తాడు' అని శాస్త్రము లోభివాని చెంపను వాయించింది. అయితే

నేమి? చెంపను సముదాయించేందుకు చేయి లేదా? అనుకుంటాడు. వాడే లోభి.

కాల ప్రవాహంలో మన తోడు నడిచే వారెవ్వరూ లేరు. దేనిని పట్టుకొని ఉన్నామో దానిని వదలి పెట్టక తప్పదు అనేది జీవన సత్యం. మితిమీరిన ఆశలు, మతి చెడిన ఊహలు మనిషికి గతి లేకుండా చేస్తాయనే నగ్న సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

వదిలే ఇచ్ఛ లేని దుర్గుణమే లోభం. ఇది వస్తువులతో సరిపోదు. విషయాలతో ఆగిపోదు. బ్రతుకునే విషతుల్యంగా మార్చుతుంది. త్యజించే అలవాటు లేని లోభము అజ్ఞానమును కూడా వదలకుండా పట్టుకుంటుంది. దేహాభిమానమును దూరము కానివ్వదు. అహంకారమును ఆవలికి నెట్టదు. ఇది పెద్ద ప్రమాదమై కూర్చుంటుంది. అందుకే కృపణుడు అనే దానికి లోభి అనే సామాన్య భావమే గాక 'అజ్ఞానమును త్యజించలేని అయోమయ జీవి' అని కూడా ఉపనిషత్తు నూతన నిర్వచనమును చేసింది.

లోభమును త్యాగముతో జయించాలి. వచ్చిన నీటిని ఆపుకోకుండా ముందుకు పంపుతున్నందుకు నది నిర్మలంగా ఉంది. త్యజించక తనలో నిలుపుకుంటున్నందుకు కూపము మలిన పడుతుంది. మలినయుత మైనందు వల్ల లోభము అజ్ఞానానికి ప్రతీకం. నిర్మలమై నందున త్యాగం జ్ఞానానికి సంకేతం.


(14వ పేజీ తరువాయి)

ఒక్క మాట. గుణకర్మలను బట్టి వర్ణ వ్యవస్థ ఆవిష్కరింప బడింది. ఆర్య భూమికి, ఆర్ష సంస్కృతికి కులవ్యవస్థ తెలియదు. సమాజ శరీరంలో ఆరోగ్యవంత మైన వెన్నముకలా భాసించ వలసిన వర్ణ వ్యవస్థ దురదృష్ట వశాన ఒక దుర్దశలో రాచపుండులా పరిణమించింది. ఇది వ్యవస్థలో దోషం కాదు. వ్యక్తిలో సాగిన మోసం. వ్యక్తి స్వార్థ జీవనం నిర్మించిన వికృత విషభాండం.

గతం చేసిన గాయాల్ని వర్తమానం నయం చేయాలి. అజ్ఞానం అందించిన అయోమయ ధోరణి జ్ఞానం వల్లనే అదృశ్యం కావాలి.

విశ్వనాథుని ఆజ్ఞను అనుసరించి భాష్యాలను రచించడానికి బదరికాశ్రమం సరైన ప్రదేశ మని నిర్ణయించుకున్నారు శ్రీ శంకరులు.

(సశేషం)



ఉన్న దెక్కడ? లేని దేమిటి?

స్వామి సుందర చైతన్యానంద

మనస్సు జడం. 'జడము' అంటే మరొక దానిపై ఆధారపడి ప్రకాశించేది అని అర్థము. అలాంటిది వికారం చెందుతూ ఉంటుంది. జడ మైన దేహం ఎలా మార్పు చెందుతూ ఉందో, అలాగే జడ మైన మనస్సు కూడా మార్పు చెందుతూ ఉంది. మనస్సులో ఒకప్పుడు ఈర్ష్య, ఒకప్పుడు ప్రేమ, మరొకప్పుడు క్రోధం, వేరే సమయంలో మోదం, మోదం అని భావించే లోగా ఖేదం. ఇలా మార్పు చెందే మనస్సును ప్రకాశింప చేసేది స్వప్రకాశమైన ఆత్మయే. ఆత్మపై ఆధారపడి ప్రకాశించే మనస్సు ఆత్మను తెలుసుకోలేదు.

తన కార్యకలాపాలను సాగించుటకు మనస్సు చైతన్యముపై ఆధారపడి ఉంది. కాని, స్వప్రకాశమైన చైతన్యమునకు మరొక దాని అపేక్ష ఉండదు. **(జడం హి స్వకార్యార్థం చేతనం అపేక్షతే, న చేతనస్య పరాకాంక్షా).**

మనస్సు ఆలోచిస్తుంది. ఆలోచించే మనస్సుకు చైతన్యం ఆధారంగా ఉంది. చైతన్యం ఉంటేనే మనస్సు ఆలోచిస్తుంది. మనస్సు లేకపోయినా చైతన్యం ఉంటుంది. ఉదాహరణకు గాఢ నిద్ర. మనస్సు ఆత్మను తెలుసుకోలేదు. ఎందుకని? మనస్సు యొక్క ఉనికికి, ఊడిగమునకు ఆత్మయే ఆధారమై ఉన్నందున, ఆధేయమైన మనస్సు ఆధారమైన ఆత్మను తెలుసుకోలేదు.

వాస్తవానికి ద్రష్ట ఆత్మయే. ఇంద్రియ మనస్సులు కరణములు మాత్రమే. సర్వమును స్వయంగా దర్శించే ద్రష్ట యైన ఆత్మను ఎవ్వరూ దర్శించలేరు **(యం న పశ్యతి కశ్చన).** ఆత్మను దర్శించుటకు నేత్రములు, వాక్కు మనస్సులకు శక్తి చాలదు. **(న తత్ర చక్షు ర్గచ్ఛతి, న వాక్ గచ్ఛతి నో మనః - కేనోపనిషత్).**

కనుక ఆత్మను గ్రహించేందుకు మనస్సు, వాక్కు ప్రమాణం కావు. ఆత్మ తెలియాలి అంటే ఆత్మకు సంబంధించిన జ్ఞానం కలగాలి. జ్ఞానము కలగా లంటే ప్రమాణ ముండాలి **(ప్రమాకరణం ప్రమాణం).**

కాని, ఆత్మ ప్రమాణ సిద్ధం కాదు. అంటే, ప్రమాణాలకు అందేది కాదు అని అర్థము. ప్రమాణానికి అందినది అంటే ఆత్మ ప్రమాణానికి విషయ మైంది అని అర్థము. విషయ మైనది దృశ్య మవుతుంది. దృశ్య మైనది జడ మవుతుంది. ఇదొక పెద్ద గందరగోళం.

ఆత్మ దృశ్యమై, జడమై, ప్రమాణానికి అందితే ఆత్మ 'విషయ' మై ప్రమాణం 'విషయి' **(ద్రష్ట)** అవుతుంది. అప్పుడు ప్రమాణాన్ని ఫలింప చేసిందెవరు? ప్రమాణం ఆత్మను సృష్టిస్తుందా, లేక ఆత్మ వైన నీవు ఉంటే ప్రమాణం ఫలిస్తుందా? కనుక ఆత్మ స్వతః సిద్ధమే గాని ప్రమాణ సిద్ధం కాదు.

ఆత్మ జ్ఞానరూపమై ఉంది. ఆత్మజ్ఞానానికి మరొక జ్ఞానం అవసరం లేదు. **(ఆత్మ జ్ఞానంతు విజ్ఞాన అనపేక్షం, కస్మాత్? విజ్ఞాన స్వరూపత్వాత్).** ఇంద్రియ మనస్సులు పరిమిత మైనవి కనుక ప్రత్యక్ష ప్రమాణానికి అనంతమైన ఆత్మ అందదు. తోకను చూచి ఎలుక అని గ్రహించినట్లు, పొగను చూచి అగ్ని అని తెలుసుకున్నట్లు, పూర్వానుభవమును, స్మృతులను ఆధారం చేసుకొని అనుమాన ప్రమాణం ద్వారా నిర్ణయించుటకు ఆత్మ స్మృతులకు సంబంధించినది కాదు. స్మృతులు మనస్సు లోనివే. కనుక అవీ జడములే.

జడములై, వికారము చెందే వన్నీ ఒక దశలో నిషేధింపబడి బాధితా లవుతున్నాయి. ఆత్మ నిషేధింప బడేది కాదు. ఒకవేళ ఆత్మ నిషేధింప బడేదే అయితే, అలా బాధితమైన ఆత్మను తెలుసుకొనే దెవరు? పోనీ, అది అయినా ఆత్మ కావాలి కదా? నిషేధింపబడే వాటిని తెలుసుకొంటూ అన్నీ నిషేధింపబడిన తరువాత, నిషేధింపబడక అబాధితమై ఏది సాక్షి స్వరూపంగా భాసిస్తూ ఉందో అదే ఆత్మ **(నిషేధావధీ సాక్షీ).**

అట్టి సాక్షీ చైతన్యమును మనస్సు, వాక్కు గ్రహింపగలవా? **(మనసా వచసాం అగమ్యం)** గ్రహించలేవు. 'గ్రహించలేవు' అనే మాట పలకడానికి కూడా చైతన్యమే ఆధారము. వాక్కులకు అంతుపట్టని ఆత్మ యొక్క అనుగ్రహము వలననే వాక్కులు కదులుతున్నాయి **(వాచో విభాన్తి నిఖిలా యదనుగ్రహేణ).**

ఇది కాదు - ఇది కాదు

నేతి - నేతి (ఇది కాదు - ఇది కాదు) అనెడి వాక్యముల ద్వారా వేదము ఆత్మను నిర్దేశించుచున్నది. "ఇది కాదు" అనే వాక్యములో 'ఇది' - 'కాదు' అనే రెండు పదము లున్నాయి. 'ఇది' అన్నప్పుడు, ఏదో ఉన్నది కనుకనే 'ఇది' అనవలసి వచ్చింది. కనుక 'ఇది' అనేది ఉన్నది అని అర్థం. 'కాదు' అంటే, లేనిది అని ఎలా చెప్పగలం? కనుక 'ఇది' అంటే ఉన్నది అని నిర్ణయించాం కాబట్టి "ఇది కాదు" అంటే 'ఇది ఉన్నది కాదు' అని అర్థము.

"ఇది కాదు" (నేతి) అనే వాక్యములో 'ఇది ఇది కాదు' అనేది దాని అర్థం కాదు. 'ఇది అది కాదు' అనేది కూడా కాదు. 'ఇది లేదు' అనే అర్థం అసలే కాదు. "ఇది కాదు" అంటే "అది ఇది కాదు" అని భావం. 'ఇది' అదే అయినా, 'అది' ఇది కాదు అని గ్రహించడమే వివేకము. ఈ వివేకము చేత మాటలకు, వాక్కుకు అందని ఆత్మను గ్రహింప వీలవుతుంది **(వివేకతః బోద్ధుం శక్యం ఇతి).**

మట్టి కుండ, మట్టి ముంత, మట్టి మూకుడు - వీటి విషయంలో "ఇది కాదు - ఇది కాదు" అంటే, 'మట్టి కుండ మట్టి కుండ కాదు' అనేది అర్థం కాదు. 'మట్టి కుండ మట్టి కాదు' అనేదీ కాదు. 'మట్టి కుండ లేదు' అనేదీ కాదు. "ఇది కాదు" అంటే 'మట్టి, కుండ కాదు' అని భావం. కుండ మట్టే అయినా మట్టి కుండ కాదని గ్రహించటమే వివేకము. మట్టిని కుండ అంటే ముంత విషయ మేమిటి? మూకుడు విషయ మేమిటి? అనే ప్రశ్నలు తలెత్తుతాయి.

(21వ పేజీ చూడుము)

మహిష్మతిలో శంకరయతి

ధారావాహిని-5

స్వామి సుందర చైతన్యానంద

కుమారిలుని శిష్యులు

భట్టు కుమారిలునికి అనేకమంది విద్వత్తు గల శిష్యు లుండేవారు. వారందరు మీమాంస శాస్త్రమును విశేషంగా ప్రచారం సాగించారు. ఒక విధంగా చెప్పాలంటే ధార్మిక విప్లవాన్నే సృష్టించారు అనవచ్చు. వీరి శిష్యగణంలో ముఖ్యులు ముగ్గురు. 1.ప్రభాకరుడు 2.మండనమిశ్రుడు 3.ఉంబేకుడు (లేదా భవభూతి).

ప్రభాకరుడు మీమాంస శాస్త్రమున గొప్ప నిష్ణాతుడు. ఈయన అలౌకిక కల్పనా శక్తికి మెచ్చి కుమారిలుడు ఇతనికి 'గురు' వను బిరుదము నిచ్చాడు. మీమాంస శాస్త్రమున ఇతడొక నూతన సిద్ధాంతమునే సృష్టించాడు. అతని తరువాత అది 'గురుమత' మనే పేరుతో ప్రాచుర్యము నొందింది. కుమారిలుని రెండవ శిష్యుడు మండనమిశ్రుడు. ఇతని బుద్ధి వైభవమును, వ్యాఖ్యాన కౌశలమును గాంచి పండితులు కూడా ఆశ్చర్యపడేవారు. శ్రీ శంకరాచార్యుల వారితో ఇతనికి శాస్త్రార్థము జరిగింది. మున్ముందు ఆసక్తికరమైన మండనమిశ్రుని చరిత్రను తెలుసుకుందాము.

ఉంబేకుడు మూడవ శిష్యుడు. ఇతడే భవభూతి. ఈ విషయములో భిన్నాభిప్రాయా లున్నాయి. కానీ సప్రమాణ నిరూపణలు కూడా ఉన్నాయి. ఇతడు గొప్ప వాగ్వైభవము కలవాడు. ఇతడు కుమారిలుని శ్లోక వార్తికముపై టీకను గూడ రచించినాడు.

శ్రీహర్షుడు రచించిన 'ఖండన ఖండ ఖాద్యము' గ్రంథమునకు ఆనందపూర్ణుడు 'విద్యాసాగరి' అను టీకను రచించినాడు. అందులో ఉంబేకుని రెండు శ్లోకములను కూడా ఉదహరించి యున్నాడు. అచ్చోట ఉంబేకుని శ్లోక వార్తిక టీకను గూర్చి ప్రస్తావించినాడు.

మండనమిశ్రుని 'భావనా వివేకము' మీద కూడా ఉంబేకుడు టీక వ్రాసినాడు. 'భావనా వివేకము' మీమాంస శాస్త్ర గ్రంథములలో చాలా ప్రౌఢమైన గ్రంథము. భవభూతియే ఉంబేకుడు. అయితే, ఎక్కువ మందికి భవభూతి ఒక నాటకకారుని గనే తెలుసు. కాని ఆయనను మీమాంసకుని స్థాయి నుండి కూడా అధ్యయనం చేయాలి.

ఈశ్వర తిరస్కార భ్రాంతి

కుమారిలుడు నిరీశ్వరవాది కాడు. ఆయన 'శ్లోకవార్తికము'ను ప్రారంభిస్తూ రచించిన మంగళాచరణ శ్లోకము ఈశ్వర ప్రార్థనయై ఉన్నది.

విశుద్ధ జ్ఞాన దేహాయ త్రివేదీ దివ్య చక్షుషే,
శ్రేయః ప్రాప్తి నిమిత్తాయ నమః సోమార్ధ ధారిణే॥

అని ఈశ్వరుని ప్రస్తుతించినాడు.

జైమినీ ప్రోక్తమైన మీమాంస మతమును రక్షించుటకు కుమారిలుడు ఈశ్వరుని తిరస్కరించినాడు అనే భ్రాంతి జనులలో చోటు చేసుకుంది. అది అపోహ మాత్రమే. మీమాంస శాస్త్రము యొక్క ప్రధానోద్దేశ్యము కర్మ ప్రాధాన్యమును చూపుటయే. ఈ విషయమును స్థిరీకరించే ప్రయత్నంలో ఈశ్వరుని ప్రక్కన ఉంచిన మాట వాస్తవమే నని కుమారిలుడే శంకర భగవత్పాదులతో చెబుతాడు.

'నాకు పూర్వీకుడైన భర్తృమిత్రుడు మీమాంస శాస్త్రమునకు వింత వ్యాఖ్యానము చేశాడు. అతని వ్యాఖ్య ఫలితంగా మీమాంస శాస్త్రము నాస్తిక మతమైన చార్వాకము లాగా జనులకు కనిపించింది. కానీ, నేను నా వ్యాఖ్యల ద్వారా ఆ దోషాలను నివృత్తి చేసి, ఆస్తిక మార్గము లోనికి తెచ్చుటకు ప్రయత్నించాను. ఈ ప్రయత్నములో కర్మ ప్రాధాన్యమును నిర్ణయించుటకు ఈశ్వర ఖండనము చేసినాను. ఇది నా అపరాధము. కానీ, ఈశ్వరుని యందు నాకు పూర్ణ విశ్వాసముంది' అని తుషాగ్నిలో వెలిగిపోతూ కుమారిలుడు శ్రీశంకరులతో చెబుతాడు.

ఇది, కుమారిలుని గాథ. శంకర కుమారిలుల సమాగమము మహత్త్వ పూర్ణము. వీరిరువురు ఒక నూతన శకమునకు నాంది పలికిన మహాత్ములు. వైదిక ధార్మిక వృత్తిని జాజ్వల్యమానం చేయుటలో ఒకరు తైలముగ, మరొకరు అగ్నిగా రాణించారు. శోభించారు.

బౌద్ధులు ఆర్షధర్మము లోని కర్మకాండపై చేసిన ఆక్షేపములకు కుమారిలుడు గట్టిగా సమాధానం చెప్పి దానిని పునః ప్రతిష్ఠించారు. అలాగే ఆర్షధర్మము లోని జ్ఞానకాండపై సాగిన బౌద్ధ జైన ఆక్షేపములను శ్రీ శంకరులు నిశితంగా ఖండించి దానిని తిరిగి ప్రతిష్ఠించారు. ఈ విధంగా కుమారిలభట్టు, శ్రీ శంకరు లిరువురు వైదిక ధర్మాన్ని రక్షించారు. బౌద్ధ జైన మతాలు వీరవిహారం చేస్తున్న ఆ సంక్లిష్ట సమయంలో వీరిరువురి కృషి వల్లనే వైదిక ధర్మ పునరుద్ధరణము గావించ బడింది. వైదిక ధర్మ మండనమూ, అవైదిక ధర్మ ఖండనము రెండూ జరిగి పోయినవి.

ప్రాతఃస్మరణీయుడైన మహాత్ముడు భట్టు కుమారిలుడు. తుషాగ్నిలో దేహాన్ని చాలిస్తూ, శ్రీ శంకరులకు నమస్కరించి,

అయం చ పంథా యది తే ప్రకాశ్యః సుధీశ్వరో మండనమిశ్ర శర్మా।
దిగంత విశ్రాంత యశా విజేయో యస్మిన్ జితే సర్వమిదం జితం స్యాత్॥

'నన్ను జయించి, మీ అద్వైత సిద్ధాంతమును ప్రకాశవంతం చేయాలని మీ అభీష్టమైతే నలుదిక్కుల వ్యాపించిన కీర్తి గలవాడు, పండితవర్యుడు అయిన మండనమిశ్రుని జయించు. అతణ్ణి జయిస్తే సమస్తాన్ని జయించినట్లే.

నివృత్తిశాస్త్రే న కృతాదరః స్వయం కేనాప్యుపాయేన వశం స నీయతామ్।
వశం గతే తత్ర భవే న్మనోరథః తదంతికం గచ్ఛతు మా చిరంభవాన్॥

'అతడు సహజముగా జ్ఞానకాండను అంగీకరించడు. ఏ విధమైన ఉపాయము చేతనైనా అతనిని వశపరచుకోవాలి. అతడు వశమైతే మీ మనోరథము నెరవేరుతుంది. కనుక శీఘ్రంగా అతనిని కలుసుకోండి' అని పలికి దేహత్యాగం చేశాడు భట్టు కుమారిలుడు. కుమారిలుడు చెప్పినట్లు శ్రీ శంకరులు మండనమిశ్రుని కలియుటకు అతడు నివసిస్తున్న మహిష్మతీ నగరానికి చేరుకున్నారు.


(సశేషం)

(18వ పేజీ తరువాయి)

కుండ యొక్క అస్తిత్వానికి మట్టి ఆధారంగా ఉంది. కుండకు కారణ మైన మట్టి, కుండలో మట్టి గానే ఉంది. కుండ అనేది కేవలం నామరూపాలే. కనుకనే మిథ్య. కుండ మిథ్య. మట్టి సత్యం. కుండ మట్టిపై ఆధారపడి ఉంది. మట్టినే ఆశ్రయించుకొని ఉంది. కుండ మట్టే అయి ఉంది. మట్టి సత్యం కనుక సదా విలక్షణంగా ఉంది.

ఇది వివేకము. సత్యమిథ్యా వివేకము. ఆత్మానాత్మ వివేకము. ఈ విధమైన వివేకము వలన ఆత్మ యందు ఆరోపించబడిన అనాత్మ నిషేధింప బడుతుంది. ఆ తరువాత కేవలము ఆత్మయే పరిశిష్టమై ఉంటుంది. ఆ ఆత్మయే బ్రహ్మము. అతడే దేవదేవుడు. పుట్టుక లేని వాడు **(అజం)**, నశింపు ఎరుగనివాడు **(అచ్యుతం)**.

సంతాపము




డా॥ శ్రీ కె.వి.శేషారెడ్డి
సుందర సత్సంగ్
నెల్లూరు



శ్రీమతి ఐ.ఇందిరమ్మ
సుందర సత్సంగ్
నెల్లూరు

యజ్ఞ పోషకులు




డా॥ శ్రీమతి పి.భార్గవి
శ్రీ ఎమ్.రవీంద్రనాథ్ ఠాగూర్
హైదరాబాద్
రూ.1,12,000/-




కుమారి డి.ధనూజ
హైదరాబాద్
రూ.50,000/-

మహారాజ పోషకులు
(రూ.10,000/-)



రేణుక, కె.సందీప్
సహస్ర
కడప, రూ.25,116/-



శ్రీ ఎ.రంగయ్య
హైదరాబాద్
రూ.25,000/-




శ్రీమతి జి.హరిత
శ్రీ సి.హెచ్.ప్రవీణ్ కుమార్
హైదరాబాద్, రూ.25,000/-



శ్రీమతి ఎస్.ఎస్.కాంతం
ఆశ్రమం
రూ.20,000/-



శ్రీమతి ఎస్.సావిత్రి
కుమారి ఎస్.యశస్విని
ఒంగోలు



శ్రీ ఎమ్.వెంకట రావు
హైదరాబాద్



శ్రీమతి ఎస్.అనసూయా దేవి
సికింద్రాబాద్




కుమారి పి.వసుమతీ దేవి
నిజామాబాద్




శ్రీమతి జి.శశికళ
శ్రీ జి.లక్ష్మణ రావు
హైదరాబాద్



శ్రీ వి.శంకర్
బషీరాబాద్




శ్రీ వి.సుబ్బారావు
హైదరాబాద్




శ్రీ ఎన్.ఎస్.కె.ప్రసాద్
హైదరాబాద్

రాజపోషకులు
రూ.5,000/-




చి॥ కుసుమ కుమారి
హైదరాబాద్



శ్రీ ఎ.ఆర్.జయకుమార్
కీలమంగలం



శ్రీమతి జె.సంపత్ లక్ష్మి
కీలమంగలం



శ్రీ ఆర్.వెంకట సతీష్
నెల్లూరు




శ్రీమతి ఎ.సుమని
కడప




శ్రీమతి జి.ధనలక్ష్మి
వెస్ట్ గోదావరి



శ్రీమతి జి.రుక్మిణమ్మ
హైదరాబాద్




శ్రీ డి.రాధాకృష్ణ రెడ్డి
కడప



శ్రీ ఐ.బ్రహ్మ రెడ్డి
హైదరాబాద్




చి॥ కె.దేవర్ష్ రెడ్డి
హైదరాబాద్



శ్రీ పి.రవిబాబు
హైదరాబాద్




శ్రీ పి.గంగాధర్
నిర్మల్



శ్రీ డి.రాజ్ కుమార్
హైదరాబాద్



శ్రీ పి.రజనీకాంత్
బెంగుళూరు



చి॥ ఎమ్.చంద్రకళాధర్ రెడ్డి
హైదరాబాద్



శ్రీమతి జి.నాగకుమారి
రాజమండ్రి



చి॥ వెంకట పుష్పహాస్
వైజాగ్




శ్రీ ఎస్.శ్రీకాంత్
హైదరాబాద్



శ్రీమతి జి.విజయలక్ష్మి
హైదరాబాద్



శ్రీమతి జె.తార
కరీంనగర్



చి॥ రుద్రవీర్
నెల్లూరు



చి॥ శ్రీహన్
అమెరికా



శ్రీమతి యు.శారదాబాయి
హైదరాబాద్



శ్రీమతి పి.వేదవతి
చెన్నై



శ్రీమతి ఎస్.శ్రుతి
వాఘాపూర్











చైతన్య కుసుమాలు


స్వామి సుందర చైతన్యానంద

- ఇచ్చే ఇష్టం లేనప్పుడు పుచ్చుకొనే హక్కు లేదు.
- జీవిత సమస్యకి మరణం పరిష్కారం కాదు. మరణ సమస్యను జీవితం పరిష్కరించాలి.
- తీపి తిని తెచ్చుకున్న అనారోగ్యాన్ని చేదు మ్రింగి పోగొట్టుకోవాలి.
- కర్మలలో శ్రమ ఉంది. జ్ఞానంలో శాంతి ఉంది.
- భగవంతుడు మనలను కని పారేయలేదు. కనిపెట్టుకొని ఉన్నాడు.
- మార్చటం - మారటం రెండూ ఒక్కటే. మార్చటం కష్టతరం - మారడం శ్రేయస్కరం.
- పరిస్థితుల్ని మనం శాసించలేము. ప్రవర్తనను మనం నియంత్రించుకోగలం.
- పరమాత్మ వద్ద బిచ్చగాళ్ళ వలె కాక బిడ్డల వలె మెలగాలి. బిడ్డలై మిగలాలి.
- పరీక్ష రత్నానికే గాని రాయికి కాదు.
- మాట నిలిచినపుడే మనిషి నిలుస్తాడు. మాట పడితే మనిషి పతన మౌతాడు.
























ధ్యాన వైభవము

స్వామి సుందర చైతన్యానంద

సూర్యాస్తమయంతో విశ్వంలో వెలుగులు ఆరిపోతాయి. చీకట్లు ముసురు కుంటాయి. ఇవి బాహ్య తిమిరాలు. బాహ్యంలో చీకట్లు ఉన్నంత మాత్రాన వ్యక్తి ఆంతర్యంలో అంధకారం ఉండ నవసరం లేదు.



బాహ్యం లోని చీకట్లు మనల్ని బాధించవు. ఆంతర్యంలో చీకట్లు వ్యాపిస్తే బాహ్యంలో వెలుగులున్నా వ్యక్తి గ్రుడ్డివాడు గానే మిగిలి పోతాడు. అస్తమించిన సూర్యుణ్ణి వెంటనే తీసికొని వచ్చి ఆకాశంలో ఉంచడం ఎవ్వరికీ సాధ్యం కాదు. కాని, హృదయాకాశంలో అస్తమించిన వెలుగుల్ని తిరిగి ఆవిష్కరించుకోవడం వివేకవంతులకు అసాధ్య మేమీ కాదు.

బాహ్యంలో ఒక్క వెలుగులే కావు; ఏవయినా మారుతూనే ఉంటాయి. ఒకే లాగ ఉండవు. అలాగని, వాటితో పాటు మనిషి కూడా తదనుగుణంగా మారుతూ పోతే, విశ్వంలో చీకట్లు వ్యాపించి నపుడు వాటి ప్రభావం మనస్సుపై కూడా ఉంటుంది. మనిషిపై ఉంటుంది. మనుగడే చీకటిమయ మవుతుంది. అది ఎంత దుర్భరమో ఆలోచిస్తే అర్థ మవుతుంది.

దుర్భరమైన మనస్సును కలిగిన దుర్బలులకు ధ్యాన మనేది దుర్లభం గానే ఉంటుంది. ధ్యాన మనేది పరమేశ్వరునికి సంబంధించి మనం సాగించే మానస వ్యాపారము. మార్పుల సంగీతానికి నాట్యం చేసే మనస్సు మార్పులేని మహేశ్వరునిపై ఎలా ధ్యానం చేస్తుంది?

ధ్యానం చేయడానికి కొందరు పూజాగది లోకి వెళ్ళొచ్చు. కొందరు మందిరాలకు వెళ్ళొచ్చు. కొందరు వన ప్రదేశాలకు పోవచ్చు. మరికొందరు నదీతీరాలను చేరవచ్చు. ధ్యానం చెయ్యడానికి ఎవరు ఎక్కడికి పోతున్నారు? అనేది తెలియదగిన విషయం కాదు. కాని, ధ్యానం చేసేవారు అందరూ ప్రవేశించేది మనస్సు లోకే అనేది మాత్రం ధ్యాన యోగులకు తెలియవలసిన విషయం.

విహారయాత్రలకు ఒంటరిగా వెళ్తే సుఖ ముండదు. కొందరితో కలసి వెళ్ళాలి. కాని ధ్యానవిహారానికి వ్యక్తి ఒంటరి గానే వెళ్ళాలి. అప్పుడే సుఖం. అందుకనే ఏకాంతమున **(రహసిస్థితః)** ఒంటరిగా **(ఏకాకీ)** ధ్యానాన్ని ప్రారంభించ మన్నాడు గీతాచార్యుడు. ఏ సహాయ మును లేనివాడుగా ఏకాకిని అభివర్ణించారు శ్రీ ఆదిశంకరాచార్యస్వామి **(రహసి స్థితః సన్ ఏకాకీ అసహాయః).**

ధ్యానంలో అన్యుల సహాయము అవసరము లేదు. ఆదుకోవటానికి ఆలంబనంగా ఉండటానికి అచ్యుతుడు అక్కడ సిద్ధం గానే ఉన్నాడు. అదే ధ్యాన వైభవము.

కొన్ని విషయాలలో ఇతరుల సహాయం మనకు అవసరం. కాని, ధ్యాన విషయంలో అన్యుల ప్రవేశము అనూహ్యము. పైగా ప్రతిబంధకము కూడా. మూటను తల పైకి ఎత్తడానికి ఇతరులు సహకరించాలి. శ్వాసలను ఆడించడానికి అన్యుల సహాయము మనకు అవసరమా? అక్కడ కూడా అతిప్రేమను కూడగట్టుకొని అన్యులు ప్రవేశిస్తే, శ్వాసలు ఆడుతాయో, ఆగుతాయో చెప్పలేము. ధ్యానం విషయంలో కూడా ఇతరుల ప్రమేయం ఇలాగే ఉంటుంది.

కనుక ధ్యానయోగి ఒంటరి వాడుగా ధ్యానాన్ని కొనసాగించాలి. ధ్యానానికి ఏకాకిగా ప్రవేశించాలి. ధ్యానంలో ఏకాకిగా ఉండాలి. అంటే, తోడు ఎవరూ ఉండకూడదు. తోడు అనేది మనస్సుకు సంబంధించిన విషయమని నేను ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదనుకుంటున్నాను.

ఏకాకి మనస్సులో ఎవ్వరూ లేరు. లేకుండా ఉండాలి. సరే. వ్యక్తులు లేరు. విషయాలు ఉండవచ్చా? ఏ విషయాలు? వ్యక్తులకు సంబంధించిన విషయాలే కదా? వ్యక్తులు వేరు - విషయాలు వేరుగా ఉన్నాయా? విషయా లుంటే వ్యక్తులు ఉన్నట్లే. కనుక, ఏకాకి అంటే వ్యక్తులు, విషయాల నుండి విడిపడి యున్నవా డని అర్థం. అప్పుడే ధ్యానం సాగుతుంది. మనస్సును ధ్యానంలో నియమించడ మంటే ఇదే **(యోగీ నియత మానసః - నియతం సంయతం మానసం మనః యస్య సః అయం నియతమానసః).**

ఏ సహాయం లేకుండా, ఎవరి సహాయం లేకుండా తనలో తాను సుఖించడం తెలిసినవాడు ధ్యానయోగి **(యోన్త సుఖోన్తరారామః).** తన ఆత్మ యందే తాను సుఖించు వాడు, రమించువాడు అని అర్థము **(యః అన్తః సుఖః ఆత్మని సుఖం యస్య సః అన్తః సుఖః, తథా అన్తః ఏవ ఆత్మని ఆరామః క్రీడా యస్య సః అన్తరారామః).** ధ్యానయోగి ఆత్మ యందే సుఖించేవాడు కావాలి. ఆత్మయందే విహరించేవాడు కావాలి.

అలా ఉండాలి అంటే, బాహ్యవిషయాలు అతడిని బాహ్యానికి లాగకుండా ఉండాలి. బయట విషయాలు లోపలున్న వ్యక్తిని ఎలా లాగుతాయి? అవి లోపల ఉన్నప్పుడే లోపల సుఖించే వాణ్ణి బాహ్యానికి ఈడుస్తాయి. అలా జరుగకూడ దనేది అభిమత మైతే, బాహ్య విషయాలను లోనికి రానివ్వకుండా బాహ్యం లోనే ఉంచి యోగి ధ్యానంలో ప్రవేశించాలి. పాదరక్షలను గుడి బయట ఉంచి ఆలయం లోకి ప్రవేశించినట్లు, బాహ్య విషయాలను బాహ్యం లోనే ఉంచి ధ్యానం లోకి ప్రవేశించాలి **(స్పర్శాన్ కృత్వా బహిః బాహ్యాన్).**

కాళ్ళకు చెప్పుల్ని తొడుక్కుంటామే గాని చెప్పులకు కాళ్ళు లేవు. కనుక, ఎక్కడ మనం విడిస్తే, అక్కడే విడవకుండా పడి ఉంటాయి. కాని, విషయాలు వేరు. వాటికి రెక్క లున్నాయి. రెక్కల్ని ఆడిస్తూ గగన విహారం చేస్తాయి. హృదయాకాశం లోకి చొచ్చుకొని

వస్తాయి. అప్పుడేమి చెయ్యాలి? ధ్యానంలో ధ్యానయోగి ఏదో చేసేవాడు కాడు. ఏదో చేయకుండా ఉండేవాడు. ఇప్పుడూ అదే చెయ్యాలి. చూస్తూ ఉండాలి. చేస్తూ ఉండకూడదు.

ఆకాశంలో ఎండ ఉంది; నువ్వు చూస్తున్నావు. వాన ఉంది; నువ్వు చూస్తున్నావు. గాలులు వీస్తున్నాయి; నువ్వు చూస్తున్నావు. వెన్నెల ఉంది; నువ్వు వీక్షిస్తున్నావు. ఇవన్నీ ఆకాశం లోనే తెలుస్తున్నాయి. ఇవేవీ లేకపోయినా ఆకాశము ఉంది. ఉంటుంది. వినిర్మలంగా ఉంటుంది. విశుద్ధం గానే ఉంటుంది.

ఎండ తీవ్రంగా ఉంది. వర్షం భయంకరంగా కురుస్తోంది. గాలులు చల్లగా వీస్తున్నాయి; వెన్నెల మసకగా ఉంది - ఇలాంటి మాటలు వినిపిస్తాయేమో గాని, ఆకాశం బాగలేదు అని ఎవ్వరూ అనరు. ఆకాశం మీద ఎవ్వరికీ అభియోగాలు లేవు; ఫిర్యాదులు ఉండవు. అందుకే అది ఆకాశం. అన్నిటికీ అవకాశ మిస్తూ **(అవకాశ ప్రదాతృ)** తన విషయంలో అవకాశ మివ్వని అద్భుతమే ఆకాశము. అందుకే నిరుపమానమైన పరమేశ్వరుని ఆకాశంతోనే పోల్చారు **(గగన సదృశం).**

ఆకాశం వినిర్మలంగా ఉన్నట్లు ధ్యానయోగి ఆంతర్యం విశుద్ధంగా ఉండాలి. రాగాల వానలో నానకుండా, ద్వేషాల ఎండలో ఎండకుండా, ఈర్ష్యాసూయల చలిలో కుంచుక పోకుండా, వచ్చేవి వచ్చి పడుతున్నా, పోయేవి పరుగు లెత్తుతున్నా, తనలో ఏ చలనం, సంచలనం లేని ఆకాశం లాగా స్థిరమైన, నియతమైన మనస్సు ధ్యానంలో ఉండాలి. ఇక్కడే తనను తాను ప్రశాంతాత్మగా అనుభూతిని పొందడం జరుగుతుంది.

జరగ వలసినవి జరిగాయి. జరగ కూడనివి జరగాలని ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. నియతి భగవత్స్వరూపము. దానిని అతిక్రమించడం ఎవరికీ సాధ్యం కాదు.

అవసర మనుకున్నవి దూరమై మన జీవితంలో వాటి అవసరాన్ని కుదించు కున్నాయి. ఇక అవి మనకు అవసరం లేనివి అని మదింపు వేసుకోవాలి. ఉండలేనివే పోతున్నాయి. పారి పోతున్నాయి. ఉండి వెలిగినవే ఉండలేక ఆరి పోతున్నాయి. ఉన్న మనస్సులే మారి పోతున్నాయి. కలసి ఉండలేక కారిపోతున్నాయి. పోయేందుకే వచ్చిన దేహాలు బలహీన పడిపోతున్నాయి.

అన్నిటిలో నియతి ఉంది. నియతిరూపంలో నియంతే ఉన్నాడు. అర్థం చేసుకుంటే ఏదీ ధ్యానానికి అవరోధము కాదు. అర్థం కానపుడు మనకు మనమే అవరోధం. మన మనస్సే మనకు పెనుభూతం.

ధ్యానంలో భూతాలు లేవు. భవిష్యత్తులు మిగలవు. అక్కడ అంతా వర్తమానమే. పరమేశ్వరుని వర్తమానాన్ని ఆలకించడమే. అది కరుణా పూరితమైన తొలకరి. ఆ తరువాత, అంతా వర్షమే. జ్ఞానవర్షమే. ఆచార్యుని అనుగ్రహవర్షమే. **ఓం.**

మందపాల మహర్షి

స్వామి సుందర చైతన్యానంద

భౌతికంగా మనకు గోచరించే ప్రపంచము వాస్తవానికి భావనా జగత్తే అనేది ఆర్ష విజ్ఞానంలో అందమైన, అరుదైన విషయము. భావ ప్రకటనకు భాష ఉండాలి. ప్రపంచం ఒక్కటే. ఎవరైనా పలికేది నోటితోనే. కాని ఎన్ని భాషలో? భావ ప్రకటనకు భాష అవసరం. కాని, భాష లేకపోయినా, రాకపోయినా భావనావిహారం ఆగదు.

ఏమో! భావనకు మించి భాష పరుగు లెత్తలేదు. కాని, భాష అందుకోలేనంత ఎత్తుకు భావం ఎగురుతుంది. అట్టి భావాంబర విహారానికి భాష అవసరం లేదు. భాష అవసరం లేకుండా భావనా విహారానికి అవకాశం ఉన్నపుడు ఈ గగన విహారానికి మనిషియే కానక్కరలేదు. గువ్వలైనా సాగిస్తాయి. గోవులైనా ఆకాశవీథుల్లో పాలిస్తాయి.

మనిషి మనస్సులోకి మనిషి దూరలేడు. గువ్వల మనస్సులలోకి కూడా మహర్షి దూరగలడు. భావనా గుసగుసలు వినగలడు. గుట్టు విప్పగలడు. కనుకనే, భారతీయ సాహిత్యంలో పక్షులు పాడుతాయి. జంతువులు పలుకుతాయి. అలాంటి అందమైన ఒక ఉపాఖ్యానాన్ని వినిపిస్తున్నాడు వైశంపాయన మహర్షి.

ఖాండవ వనంలో వన్యమృగాల రక్తమాంసాలను చప్పరిస్తూ, క్రొవ్వును ఆరగిస్తూ, భుగభుగ శబ్దాలతో భగభగ మని మండుతూ, వనము నంతటినీ భస్మం చేస్తూ విస్తరిస్తున్నాడు హవ్యవాహనుడు. అదే వనంలో జరిత అనే శారంగికా పక్షి ఉంది. నలుగురు బిడ్డలకు జన్మనిచ్చిన తరువాత మందపాలుడనే ఆ పక్షి భర్త, బిడ్డల బాధ్యతను జరితకు అప్పగించి, తాను వెళ్ళి తన ప్రథమ కళత్రము లపితతో జీవిస్తున్నాడు.

జరిత తన నలుగురు బిడ్డలతో కలిసి ఖాండవ వనంలో జీవిస్తూ ఉంది. అగ్ని సప్తజిహ్వలతో విజృంభిస్తూ సమీపానికి వస్తున్నాడు. ఏమి చేయాలో జరితకు అర్థం కాలేదు.

నాయనా! మీకేమో ఇంకా రెక్కలు రాలేదు. నాకు రెక్కలున్నా, చలికి, వానకు, ఎండకు మీకు బాధ కలుగకుండా కప్పగలనే కాని మిమ్మల్ని మోసికొని పోలేను. అగ్నిదేవుడు ప్రచండరూపంతో మన పరిసరాలకు వస్తున్నాడు. ఏమి చేయాలో నాకు బోధపడటం లేదు అని విలపించింది. వెంటనే ఆ పక్షి పిల్లలు తమ భావాలను తల్లికి వినిపించాయి.

అమ్మా! ఏడవకు. మమ్మల్ని ఇంతకాలం కంటికి రెప్పలా కాపాడావు. తల్లిప్రేమను తనివితీరా మేము ఈ క్షణం వరకు అనుభవిస్తూనే ఉన్నాము. పావకుడు ప్రక్కకే వస్తున్నాడు. తప్పించుకోవటానికి మాకు ఇంకా రెక్కలు రాలేదు. నీకు రెక్కలున్నాయి. నీవు ఎగరగలవు. వెళ్ళిపోమ్మా!

మాతా! నీవు మాతోనే ఉన్నా, మాకు ఇప్పుడు నీవు చేయగలిగింది ఏమీ లేదు. మాతోపాటు నీవు కూడా అగ్నికి ఆహుతి కాక తప్పదు. ఆ విధంగా మన కుటుంబమంతా నశించిపోతుంది. నీవు ఉంటే, మళ్ళీ మన కుటుంబాన్ని విస్తరించగలవు. మాలాంటి బిడ్డల్ని మళ్ళీ కనగలవు. మా విషయంలో ఇప్పుడు నీకు బాధగానే ఉంటుంది. నీకు మళ్ళీ

పిల్లలు పుడితే మెల్లగా కాలమే మమ్మల్ని మరచిపోయేలా చేస్తుంది అని చెప్పాయి పక్షి పిల్లలు.

తల్లి పక్షి ఏడుస్తూ ఉందే గాని ఎగిరిపోయే ఆలోచనలో లేదు. తనయులారా! నేను మీ తల్లిని. నా హృదయం తల్లడిల్లిపోతోంది. మిమ్మల్ని విడిచి నన్ను నేను రక్షించుకోవటం ఎలాగో నాకు అర్థంకావటం లేదు. బిడ్డల్లారా! నాకొక ఆలోచన వస్తూ ఉంది. అదిగో ఈ చెట్టు క్రింద ఎలుక కన్నము ఉంది. మీరు అందులో తలదాచుకోండి అన్నది తల్లి పక్షి.

అమ్మా! ఎటు చూచినా మరణం తప్పేలాగ లేదు. బయట ఉంటే అగ్ని ఆరగిస్తాడు. కన్నంలోకి పోతే ఎలుక భుజిస్తుంది అన్నాయి పక్షి పిల్లలు. ఆ భయం మీకు అక్కరలేదు. కొంతసేపు క్రితం ఆ కన్నంలో ఉండే మూషికాన్ని ఒక డేగ తన్నుకొని పోవటం నేను కళ్ళారా చూశాను. ప్రస్తుతం ఆ బిలంలో ఎలుక లేదు. మీరు సందేహం లేకుండా ప్రవేశించవచ్చు అన్నది తల్లిపక్షి.

తల్లీ! మేము ఎలుకనూ చూడలేదు. డేగనూ చూడలేదు. డేగ ఎలుకను పట్టుకొని పోవటము నీవు చూశావు. చూడు, ఆ బిలంలో ఆ ఒక్క ఎలుకే ఉందని ఎలా చెప్పగలం? మరెన్నో మూషికాలు ఉండొచ్చు. ఇక్కడే ఉంటే, అగ్ని వచ్చినప్పుడే మరణిస్తాం. బిలం విషయం అలా లేదు. మేమే వెళ్ళి మృత్యువును ఆలింగనం చేసుకోవటం అవుతుంది. అమ్మా ఎలుకల చేతిలో మరణించటంకన్నా అగ్నికి ఆహుతి కావటమే మేలు. నువ్వు వెళ్ళు. అదృష్టం వరించి మేము జీవించి ఉంటే, నీవు మా వద్దకు రావచ్చు అన్నారు. అగ్ని చాలా సమీపానికి వచ్చింది. చెట్టును ముట్టుకొంది. జరిత ఎగిరిపోయింది.

పురతః కృచ్ఛ్ర కాలస్య ధీమాన్ జాగర్తి పూరుషః।
సకృచ్ఛ్ర కాలం సంప్రాప్య వ్యథాం నైవైతి కర్హిచిత్ ॥

యస్తు కృచ్ఛ్ర మనుప్రాప్తం విచేతా నావబుధ్యతే।
సకృచ్ఛ్రకాలే వ్యథితో న శ్రేయో విందతే మహత్ ॥

బుద్ధిమంతుడు ఆపద రాకముందే జాగ్రత్తపడతాడు. విపత్తు వచ్చినపుడు అలాంటివాడు వగచడు. ఆపదను ముందుగా ఊహించలేనివాడు కష్ట మొచ్చినపుడు బాధపడతాడు. అలాంటివారు శ్రేయస్సును పొందలేరు అని నలుగురిలో పెద్దవాడైన జరితారి పలికాడు.

అన్నా! నీవు ధీమంతుడివే కాదు; ధైర్యవంతుడివి కూడా. ఈ ఆపద నుండి మనం బయటపడే మార్గాన్ని నీవే ఊహించాలి అని రెండవవాడు సారిసృక్కుడు పలికాడు.

పెద్ద అన్న తండ్రిలాంటివాడు అని శాస్త్రాలు చెబుతాయి. మన ఆపదలను అతడే తొలగించలేనపుడు మరెవరు తొలగించగలరు? అని మూడవవాడు స్తంబమిత్రుడు పలికాడు.

అగ్నిదేవుడు ప్రళయరూపుడై మన వైపే వస్తున్నాడు. ఏడు నాల్కలు చాచి వస్తున్నాడు. వృక్షాలను నాకుతూ మరీ వస్తున్నాడు అని నాల్గవవాడు ద్రోణుడు పలికాడు. ఈలోగా

అగ్నిదేవుడు చేరువయ్యాడు. నలుగురు బాలపక్షులు అగ్నిదేవునికి నమస్కరించి ప్రార్థించాయి.

మాతా ప్రణష్టా పితరం న విద్మః
పక్షా జాతా నైవ నో ధూమకేతో
న నస్త్రాతా విద్యతే వైత్వదన్య
స్త స్మాదస్మాం స్త్రాహి బాలం స్త్వమగ్నే

అగ్నిదేవా! మా అమ్మ వెళ్ళింది. మా నాన్న ఎవరో, ఎక్కడున్నాడో మాకు తెలియదు. మేము చిన్న పక్షులం. మాకు ఇంకా రెక్కలు రాలేదు. నువ్వు తప్ప మమ్మల్ని రక్షించేవారు మరొకరు లేరు. దిక్కులేని మాకు అగ్నిదేవా! నీవే దిక్కు. అని ప్రార్థించిన పక్షిపిల్లలతో అగ్ని మాట్లాడాడు.

మందపాల తనయులారా! భయపడకండి. మీరు మందపాలమహర్షి బిడ్డలు. అందుకే, పక్షిజాతిలో ఉన్నా మీ పవిత్రత, సంస్కారము సడలిపోలేదు. ఖాండవ వన దహనంలో మిమ్మల్ని రక్షింపమని మీ తండ్రి మందపాలమహర్షి నన్ను ప్రార్థించాడు. మీ తండ్రి అభ్యర్థన, మీరు చేసిన ప్రార్థన నాకు ఎంతో ఆదరణీయంగా ఉన్నాయి అని చెప్పి, ఖాండవ వనము నంతటినీ భస్మం చేసిన హుతాశనుడు శారంగిక పక్షుల్ని విడిచిపెట్టాడు.

మహర్షీ! వైశంపాయనా! ఈ మందపాల మహర్షి ఎవరు? ఈ గుణవంతులైన పక్షి పిల్లలు ఎలా జన్మించాయి? వారి గాథ వినాలని ఆసక్తిగా ఉంది అని జనమేజయుడు కోరగానే వైశంపాయనుడు మందపాల మహర్షి ఆఖ్యానాన్ని వినిపిస్తున్నాడు అని నైమిశారణ్యంలో సూతమహర్షి శౌనకాది మునులకు చెబుతున్నాడు.

మందపాలుడు అనే మహర్షి నిరంతర స్వాధ్యాయ తపోరతుడు. ధర్మమూర్తి. దేహాన్ని త్యజించిన తరువాత మందపాలుడు పితృలోకాలకు వెళ్ళాడు. ఆ లోకాలలో ఆయన తపస్సుకు తగిన ఫలం లభించలేదు. అక్కడ దేవతల్ని ప్రశ్నించాడు. తాను చేసిన సత్కర్మలకు సముచిత ఫలం ఎందుకు లభించటంలేదు అని అడిగాడు.

మహర్షీ! నీది కర్మమార్గము. పితృలోకాలను వాంఛించి నీవు ఇక్కడికి వచ్చావు. నీకు పుత్రులు లేనందున ఇక్కడ నీకు ప్రవేశము లభించలేదు. కనుక, పుత్రుని పొందితే నీవు పితృలోకములో ప్రవేశించగలవు అన్నాడు.

మందపాలుడు ఆలోచించాడు. పక్షులలో అయితే త్వరగా అధిక సంతానమును కనవచ్చునని భావించి శారంగిక పక్షియై శారంగికా పక్షితో సంపర్కం చేశాడు. మందపాలునితో చరించిన ఆడపక్షి పేరు జరిత. ఆమె నుండి నలుగురు జ్ఞానవంతులైన పుత్రులను కన్నాడు మందపాలుడు. అండరూపములో ఉన్న ఆ నలుగురు బిడ్డలను, జరితను వదలి, తన మొదటి భార్యయైన లపిత వద్దకు వెళ్ళాడు.

మందపాలుడు విడిచి వెళ్ళినా జరిత మాతృప్రేమతో బిడ్డల్ని ఖాండవ వనంలో

పెంచింది. వారే ప్రస్తుతం అగ్నిదేవుని చేత ఖాండవ వనంలో రక్షింపబడిన పక్షిపిల్లలు.

మందపాలుడు లపితతో జీవిస్తున్నాడు. ఒకనాడు అగ్నిదేవుడు వస్తూ ఉండటం చూచి, వివరాలు అడిగాడు. ఖాండవ వన దహనానికి వెళ్తున్నట్లు అగ్ని భట్టారకుడు చెప్పాడు. తన భార్య జరిత, తన నలుగురు బిడ్డలు ఖాండవ వనంలోనే ఉన్నారని, వారిని రక్షించమని అగ్నిదేవుని ప్రార్థించాడు. సరేనన్నాడు అగ్ని. అందుకే అగ్ని పక్షి పిల్లల్ని రక్షించాడు.

జనమేజయా! ఖాండవ వనం దహింపబడిందని మందపాలునికి తెలిసింది. బిడ్డల్ని రక్షించేందుకు అగ్నిదేవుడు సరేనన్నాడు. కాని ఎందుకనో మందపాలుడు సరిపెట్టుకోలేకపోయాడు. తన బిడ్డల్ని గూర్చి ఆలోచించి అశాంతికి గురయ్యాడు.

లపితా! నా బిడ్డలు ఏమయ్యారో? అగ్ని నాకు ఇచ్చిన మాట నెరవేర్చుకున్నాడో లేదో? ఒకవేళ అగ్ని కనికరించినా, వాయువు ప్రచండంగా వీచి నా బిడ్డలను హరిస్తే ఏం కావాలి? కాపాడుకొనేందుకు వారికి రెక్కలు కూడా లేవు.

దిక్కులేని దీనురాలు జరిత. ఆమె వారిని ఎలా రక్షిస్తుంది? దారి తెలియక, దిక్కు తోచక దిగులుతో దుఃఖిస్తూ ఉందేమో! నా జ్యేష్ఠ పుత్రుడు జరితారి జారిపోలేదు కదా? సారిసృక్కును మరోసారి చూడగలనా? స్తంబమిత్రుడు సాంబాలయంలో ప్రవేశించలేదు కదా? ద్రోణుడు - ద్రోణుడు - ద్రోణుడు, నాయనా! ఎలా ఉన్నారు? ఏమయ్యారు? అని పుత్రప్రేమతో విలపించసాగాడు మందపాలుడు.

లపిత సహించలేకపోయింది. సవతిపై మందపాలుని శోకమయ కవితను జీర్ణించుకోలేకపోయింది లపిత. నాథా! నీవు మందపాలుడివో, మందభాగ్యుడవో నాకు తెలియదు. నా ముందే నీవు అగ్నిదేవుని ప్రార్థించావు. అగ్ని మాట ఇచ్చాడు. సత్యం అగ్ని లాంటిది అంటారు. అగ్నిదేవుడు అసత్యవంతుడు అవుతాడా? నీ విలాపమేమిటో, నీ విచార మెందుకో తెలియనంతటి అవివేకిని కాను.

నీ మనస్సు నా నుండి జారిపోయింది. జరిత వైపు పారిపోయింది. ఆమె యందు నీకున్న ప్రేమలో మందపాలా! వందవ వంతు కూడా నా మీద నీకు లేదు. బిడ్డల సాకుతో భార్య పొందును వాంఛించి ఇలా వాగుతున్నావు. పో! అలాగేపో! ఒక దుష్టుడైన పురుషుని ప్రేమించిన స్త్రీకి పట్టవలసిన గతియే నాకూ కలిగింది అన్నది కుపితయైన లపిత.

ఓసీ! లపితా! నీ ఆలోచనలకు, నా ఆచరణకు పొంతనే లేదు. నేను కామానికి కనలేదు. ధర్మానికి బిడ్డల్ని కన్నాను. ఉత్తమధర్మాలు చెప్పినా నీకు అర్థంకావు. నా మనస్సు బిడ్డల విషయంలో ఆందోళన చెందుతూ ఉంది. నీవు వారించినా, విమర్శలు సారించినా నేను నిలిచేది లేదు. ఆపదలో ఉన్న నా బిడ్డల్ని చూడకుండా ఉండలేను అని ఖాండవ వనానికి బయలుదేరాడు.

జరిత తిరిగివచ్చి ఖాండవ వనంలో సురక్షితంగా ఉన్న తన బిడ్డల్ని చూచి, జరిగినదంతా విని, ఆనంద బాష్పాలు రాలుస్తూ, బిడ్డల్ని పదేపదే ముద్దాడుతూ ఆలింగనం చేసుకుంటోంది.

అదే సమయానికి మందపాలుడు కూడా వనానికి వచ్చాడు. కాని, పిలిచినా బిడ్డలెవ్వరూ పలుకలేదు. పేరుపేరున బిడ్డల్ని పిలిచినా వారు తండ్రి ముఖం కూడా చూడలేదు. మందపాలుని మనస్సు చివుక్కుమంది. జరితవైపు తిరిగి, ప్రియే! వీరిలో మన జ్యేష్ఠుడెవరు? జరితారి ఎవరు? ద్రోణుడెవరు? చెప్పు జరితా! నోరు విప్పు జరితా! అన్నాడు మందపాలుడు.

ఏముంది చెప్పేందుకు, విప్పేందుకు? వెళ్ళి ఆవిడనే అడుగు. ఇంతకాలం ఎవరి వద్ద ఉన్నావో అక్కడికే వెళ్ళి అడుగు. ఇప్పుడు మేము జ్ఞాపకం వచ్చాం. కని పడేసి పోయేవాడు తండ్రి కాడు. కనికరించి పెంచేవాడు తండ్రి అంటూ చెప్పుకుపోతూనే ఉంది జరిత. జరితా! ఈ సపత్నీ దోషము అనేది కాలాలు మారినా కరిగిపోవటం లేదు. స్త్రీలలో సహజంగా ఉండే ఈర్ష్యాసూయలే ఈ దోషాన్ని పోషిస్తూ ఉంటాయి. దేవీ! అరుంధతి కూడా తన పతిదేవుడైన వసిష్ఠ మహర్షిని శంకించింది. శుభచరిత యైన అరుంధతీ దేవియే ఈ దోషము నుండి బయటపడలేదు. ఇక జరిత లపితల విషయం వేరుగా చెప్పాలా!

నాయనలారా! ఇక్కడ మీ అమ్మ మ్రోగించిన మృదంగధ్వని నాకు క్రొత్తగా లేదు. మీ పెద్దమ్మ ప్రారంభించిన వాద్య ధ్వని మీ అమ్మ దగ్గర ఆగింది. పురుషులకు ఇది తప్పేలాగ లేదు. అయినా నాది ఒక్కమాట. నేను అగ్నిదేవుని ప్రార్థించి, మిమ్మల్ని కాపాడమని కోరాను. ఆయన నాకు మాట ఇచ్చాడు. అందుకనే మిమ్మల్ని ఇలా చూడగలుగుతున్నాను అన్నాడు మందపాలమహర్షి.

జనమేజయా! అగ్నిదేవుడు చెప్పిన మాటలు పిల్ల పక్షుల స్మృతిలో మెదిలాయి. మందపాలుని వారు అర్థం చేసుకున్నారు. మెల్లగా కదిలి తండ్రిని సమీపించారు. వారిని ఒడిలో పెట్టుకొని ప్రేమతో లాలిస్తున్నాడు మందపాలుడు.

తనయులారా! మీ తల్లి జరిత ప్రేమమయి. ఆమె నన్ను ద్వేషంతో దూషించలేదు. అనురాగంతోనే అలా అన్నది. నేను మిమ్మల్ని విడిచివెళ్ళటము తప్పే. కాని, ధర్మరూపిణి యైన మీ తల్లి, కంటికి రెప్పలాగ కాపాడుతుందని తెలిసే వెళ్ళాను. ఆమె ధర్మప్రవర్తన వల్లనే మీరు ఇలా ఉండగలిగారు అన్నాడు మందపాలుడు. మందపాలుని అనురాగపూరిత వాక్కులు చెవిని పడగానే ప్రేమతో చలించిపోయిన జరిత జరిగి జరిగి భర్తను సమీపించింది.

జనమేజయా! ఇదీ మందపాలుని వృత్తాంతము అని వైశంపాయనుడు భారతకథను ప్రవాహంలా సాగిస్తున్నాడు. పనిలో ధర్మం నిండాలి. ప్రార్థనలో దైవం ఉండాలి. ఆపదలు తెలియనివారు లేరు. అపార్థాలు తలెత్తని అనుబంధం ఉండదు. ముందుచూపే ఎవరికైనా అందం. మంచిపలుకే ప్రతి మనిషికి ఆభరణం. ఈ సత్యాలే పక్షులలో కదిలిన కాంక్షలు. పక్షుల చేత కవి చేయించిన సమీక్షలు.

వ్యాసుని గళం - వినాయకుని కలం కలిసి అందించిన పంచమవేదం, వైశంపాయనుడు వక్తగా, జనమేజయుడు శ్రోతగా సాగుతున్న మహాభారతం - ఆదిపర్వం ఇక్కడే సమాప్తమైంది.

* * *

యతి జీవనం

స్వామి సుందర చైతన్యానంద

మతులు సరిపడితే లోకంలో అందరూ యతులే. యతివరేణ్యులే. సన్యాసము అనేది ఒక హోదా కాదు. అదొక జీవన విధానము. అన్నీ వదులుకొన్నవాడు సన్యాసి. అలాంటి వాడు ప్రపంచం నుండి ఏమి ఆశిస్తాడు? సన్యాసం పుచ్చుకొనే నాడే సన్యాసికి ఒక్క విషయం సుస్పష్టంగా తెలుసు. "నేను ప్రపంచం నుండి ఆశించదగింది ఏమీ లేదు. ఏదైనా అంగీకరించ వలసిందే"; ఇలా నిర్ణయించుకొనే సన్యాసాన్ని స్వీకరిస్తాడు.



తాను కనపడగానే లోకం విచిత్రంగా చూస్తుందని అతనికి తెలుసు. కనికరించి కబళం పడేసినా, తిట్టి పెట్టినా, పెట్టి తిట్టినా, అవి ఆశ్చర్యాలు కావు అని సన్యాసికి ముందే తెలుసు. ఏదో ఒక చెట్టు నీడ దొరికి, ఎంతో కొంత కడుపులో పడితే చాలు. కాలాన్ని సద్వినియోగం చేసుకోవడానికి కావలసిన దంతా తన మనస్సు లోనే ఉందని భావించి, ఉన్న అందరిని విడిచి, తాను ఒక్కడుగా మిగిలి పోవాలని సన్యాసి కాలు బైట పెడతాడు.

అంతకు మించి సన్యాసి ఏదీ ఆశించడు. కాని, అలాంటి సన్యాసికి ఏవేవో, ఎన్నెన్నో వచ్చి పడితే, చెట్టు నీడకు బదులుగా భవంతులు చుట్టేస్తే, పట్టెడు అన్నానికి బదులుగా పరమాన్నాలు ఎదురైతే, అవన్నీ పరమేశ్వరుని అనంత కృపకు నిదర్శనా లని భావిస్తాడే గాని, తాను రమించేందుకు సాధనాలని తలచి అనుభవించడు. ఇచ్చిన వాడికి తన మనస్సును ఇచ్చేసి, అతణ్ణి గూర్చే పలుకుతూ - పాడుతూ, పలకరిస్తూ - పులకరిస్తూ, కలవరిస్తూ - కలలు గంటూ కాలక్షేపం చేస్తూ ఉంటాడు.

యోగీ యోగ నియోజిత చిత్తః రమతే బాలోన్మత్తవ దేవ
భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే ॥

మనస్సును యోగమయం చేసి, పిల్లవాని వలె, పిచ్చివాని వలె (**ఉన్మత్తవత్**) సంచరిస్తూ ఉంటాడు.

ఇంతకీ, సన్యాసికి ఉన్న దేమిటి? లేని దేమిటి? ఏమో! కాని, ఒక్కటి మాత్రం సత్యం. సన్యాసికి ఏది ఉన్నా, అది తన మనస్సులో ఉందే గాని బయట లేదు. ఇది అర్థమైతే సన్యాసి ఎవరో, సన్యాస మేమిటో అర్థ మవుతుంది.

ఏదైనా భావం లోనే ఉంది. కాశికి వెళ్తే, అక్కడ గంగ ఉంటుంది. గంగలో పాలు

ఉండవు. నీళ్ళే ఉంటాయి. పాపాలు పోవడానికి పాలు అవసరం లేదు. నీళ్ళు చాలు.

సరే. గంగలో మనం మునక వేస్తాం. పాపం పోతుంది. బాగుంది. ఇంతకీ గంగా స్నానం చేసే సమయంలో మన పాపాల్ని పోగొట్టిం దెవరు? నీళ్ళేనా? నీళ్ళకు ఆ శక్తి ఉందంటారా? అదే పూర్ణ సత్యమైతే, మనకు ఒక్క నీటిబొట్టు అయినా దొరుకుతుందా?

నీళ్ళకు ఆ శక్తి లేదు. నీళ్ళలో స్నానం చేసే మనము సంకల్పం చెప్పి పాపాల్ని పోగొట్టు కుంటున్నాము అంటారా? అదే వాస్తవ మైతే, ఆ పని మనం ఎక్కడైనా చెయ్యొచ్చు. హుస్సేన్ సాగర్‌లో కూడా చెయ్యొచ్చు, శక్తి ఉంటే. బుద్ధుడు వద్దని వారించడు.

పాపాల్ని పోగొట్టే శక్తి నీళ్ళల్లో లేదు. నీళ్ళల్లో వసించే నారాయణునిలో ఉంది. గంగను తన విభూతిగా చూపే గంగాధరునిలో ఉంది. అది తెలిసి చేస్తేనే గంగాస్నానం పాపహరంగా, పుణ్యప్రదంగా శోభిస్తుంది. అంతా భావన లోనే ఉంది.

మనం అన్నం వండుతాము. నైవేద్యాన్ని వండలేము. బియ్యం ఉడికితే అన్నం అవుతుంది. పాలు, పంచదార, జీడిపప్పు, ద్రాక్ష, ఏలకులు, సగ్గుబియ్యము - ఇవన్నీ కలిస్తే పాయసం తయారవుతుంది. మరి, నైవేద్యంలో ఏవేవి వేయాలి? ఏవి కలిపితే నైవేద్య మవుతుంది? ఆలోచించండి.


నేను చెప్పనా? నైవేద్యం అనేది పదార్థం కాదు. ఏవి కలిపినా నైవేద్యం కాదు. నైవేద్య మనేది భావంలో ఉంది. భావం కలిపితే ఏ పదార్థమైనా నైవేద్య మవుతుంది.

అమ్మా! ఏం చేస్తున్నావు? అంటే, అబ్బాయికి అన్నం పెడుతున్నాను అని తల్లి చెబుతుందే గాని, నైవేద్యం పెడుతున్నాను అనదు. అలాగే భగవంతునికి నైవేద్యం పెడుతున్నాను అంటుందే గాని, దేవుడికి అన్నం పెడుతున్నాను అని చెప్పదు. ఎందుకని? అన్నం నైవేద్యం కాదు కనుక. భావం కలిస్తేనే నైవేద్య మవుతుంది. అందుకనే, మనం పెట్టేది తిరిగి మనకే వస్తుంది. అన్నం భావంతో కలిసి నైవేద్య మవుతుంది. భావాన్ని జనార్దనుడు గ్రహిస్తాడు **(భావగ్రాహి జనార్దనః)**. అక్కడే నైవేద్యం ప్రసాదంగా మారుతుంది.

భావం లేనపుడు నైవేద్యం లేదు. భావాన్ని భగవంతుడు గ్రహించ నపుడు ఇక అక్కడ అన్నమే ఉంది. ప్రసాదం లేదు. అన్నమైతే ఆకలిని తీర్చుతుంది. ప్రసాదమైతే ఆకలిని తీర్చడమే కాదు, ప్రశాంతతను కూడా ప్రసాదిస్తుంది **(ప్రసాదేతి ప్రసన్నతా)**. ప్రశాంతత అంటే దుఃఖం లేకుండా ఉండటమే గదా! ప్రసాద భావంలో సమస్త దుఃఖాలు నశిస్తాయి **(ప్రసాదే సర్వ దుఃఖానాం హానిః వినాశః అస్య యతేః ఉపజాయతే)**.

భావం ఉన్నచోట విభూతి దర్శనం జరుగుతుంది. అది ఎవరి విభూతి? ఈశ్వర విభూతి. జగదీశ్వర విభూతి. ఇది అర్థమైతే, జగన్నాథ రథచక్రాలు చలిస్తాయి. జగత్తు జగన్నాథుడుగా దర్శన మిస్తుంది. బ్రతుకు భగవన్మయ మవుతుంది.

ఇలా జీవించేవా రందరూ యతులే. సన్యాసులే. ఏది ఉంది? ఏది లేదు? అని మదింపు వేసే దుర్గతి ప్రపంచానిది. కలిమి లేములను ప్రక్కకు నెట్టి, భావసంపదతో జీవించే సద్గతి సన్యాసులది.



చైతన్య ప్రభంజనం

శ్రీ డి.వి.ఎన్.మల్లికార్జున శర్మ

కృష్ణ ప్రేమ

శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానంద సద్గురుదేవులు 16-8-2025 స్థిరవారం నాటి శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా హైదరాబాదు దుండిగల్ లోని శ్రీ సుందర చైతన్యాశ్రమంలో కృష్ణాష్టమి వేడుకలలో భాగంగా గురుగోవిందుల రథయాత్ర, భజనామృతం, అనుగ్రహ భాషణం, శ్రీకృష్ణ ప్రసాదములు మున్నగు విశేషములను వాత్సల్యంతో అనుగ్రహించారు.

ఎడతెరిపి లేని అతివృష్టి కారణంగా ఈ వేడుకలను పరిమిత సంఖ్యలో సమీప సుందర సత్సంగాలకు, మోక్షధామం సభ్యులకు ప్రధానంగా ఉద్దేశించినప్పటికి ఆహ్వానం మాత్రం అందరికీ ప్రకటితమైనది.

ముందు రోజు నుండి వర్షం కురుస్తూనే ఉన్నా ఆశ్రమ ప్రాంగణం లోని శ్రీమురళీకృష్ణ స్వామి మందిరానికి స్థానిక భక్తజనులు పెద్ద సంఖ్యలో వస్తూనే ఉన్నారు. కృష్ణాష్టమి నాటి సాయంత్రం 5 గంటలకు రథయాత్రతో ప్రారంభమయే వేడుకలు, శ్రుతిమందిరంలో పూజ్య గురుదేవుల దివ్య సందేశం, భజనామృతం, ప్రసాద వితరణ ఇత్యాది కార్యక్రమాలతో సమాప్త మవుతాయని తెలుసుకున్న నాటి సందర్శకులు, ముఖ్యంగా ఉత్తర భారతానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో వేడుకలలో పాల్గొన్నారు.

శ్రావణ బహుళాష్టమి నాడు అవతరించనున్న కన్నయ్యను ఆహ్వానిస్తూ చైతన్య స్వాధ్యాయ మాతృ మండలి వారు ఆశ్రమ ప్రాంగణం లోని ముఖ్య ప్రదేశాల్లో రంగుల రంగవల్లులను తీర్చి దిద్దారు.

దివ్య రథాలు, మందిరాలు, దేవతా మూర్తులు వివిధ వర్ణాల జాతి పుష్పాలతో అలంకృతమైనాయి. నాటి మధ్యాహ్నం వరకు కురిసిన వర్షం రథోత్సవ సమయానికి ఆగి, కార్యక్రమానంతరం పూజ్య గురుదేవుల ఆశీస్సులు అందరికీ అందిన తరువాత మళ్ళీ కొనసాగింది.

రథయాత్ర 'వాణీ చైతన్యం' నుండి ఆరంభమై శ్రుతిమందిరం వేదిక వరకు మంగళ వాద్య ఘోషతో, నృత్య గీతాలతో అద్భుతంగా సాగింది. పూజ్య గురుదేవులు మార్గమధ్యంలో

బాలకృష్ణుని వేషధారణలో ముచ్చట గొలుపుతున్న చిరంజీవి జగన్మిత్ర (ఆదిలాబాదు)ను తమ రథంపై ఎక్కించుకుని ఆశీర్వదించారు.

శ్రుతిమందిరమంతా భక్తులతో కళకళ లాడటం వలన నాటి సభ, జాతీయ సుందర సత్సంగ్ సదస్సును తలపించింది. డా॥ చంద్రశేఖరం (వైజాగ్) గారు పూజ్య గురుదేవులను పుష్ప మాలాలంకృతులను చేశారు.

పూజ్య గురుదేవులు ప్రణవ నాదంతో సభను ప్రారంభించి ముందుగా 'యదునందనా రాధారమణా' భజనను ఆలపిస్తూ అందరితో పాడించారు. అనంతరం పూజ్య గురుదేవుల కృష్ణాష్టమి సందేశం.

దాదాపు 250 జ్ఞానయజ్ఞాలతో తెలుగు జాతికి *'ఓం నమో భగవతే వాసుదేవాయ'* ద్వాదశాక్షరీ మంత్రాన్ని ఊరూరా వాడవాడలా ఇంటింటికీ చేర్చి హైందవ శంఖారావాన్ని దేశం నలుమూలలకు ప్రతిధ్వనింపజేసిన వేదాంత కేసరి పూజ్య గురుదేవులు. లక్షలాది మంది పండిత పామరులను మైదానాలకు పరుగులు పెట్టించి రప్పించి క్రీడాంగణాలను తరగతి గదులుగా మార్చి వేదాంత జ్ఞాన విజ్ఞానాలను అక్షయంగా బోధించి జ్ఞాన భిక్షను అఖండంగా వితరణ చేస్తున్న ఆర్షవిద్యావాచస్పతి పూజ్య గురుదేవులు.

జ్ఞానయజ్ఞాల సంఖ్యను మించిన సంఖ్యలో గ్రంథ రచన చేసి ఆంధ్ర, ఆంగ్ల భాషల్లో చైతన్య భగవద్గీత, చైతన్య రామాయణము, చైతన్య మహాభారతము, చైతన్య భాగవతము, చైతన్య పాంచజన్యము మున్నగు ఉద్గ్రంథాలతో పాటు వందలాది ప్రకరణ, ప్రార్థన, స్తోత్ర గ్రంథాలను అనుగ్రహించిన అపర వ్యాసులు పూజ్య గురుదేవులు.

అంచనాలకు అందనంత అద్వైత సిద్ధాంత జ్ఞాన వితరణను శ్రీ శంకర భగవత్పాదుల అడుగుజాడలలో ఒక వైపు సాగిస్తూనే ముప్పై సుందర కృష్ణ మందిరాలను నిర్మించి జ్ఞానానికి భక్తి ప్రతికూలం కాదు సరికదా, 'భగవంతుడికి సంబంధించిన జ్ఞానమే భక్తి' అని నిర్వచించి, భక్తి జ్ఞానాల అభేదాన్ని ఈ శతాబ్దంలో పునః ప్రతిష్ఠించిన అపర శంకరులు పూజ్య గురుదేవులు.

పూజ్య గురుదేవుల కృష్ణాష్టమి సందేశ పరమార్థాన్ని గ్రహించడానికి పైన పేర్కొన్న స్వల్ప ఉపోద్ఘాత స్మరణ విధాయక మైనది.

పూజ్య గురుదేవులు తమ బాల్య, తొలి యౌవన దశల్లో జరిగిన సంఘటనలను కథలు కథలుగా చెబుతూ, తమకు పుట్టుక తోనే సంభవించిన కృష్ణ భక్తిని వివరిస్తూ, సాధక లోకానికి సందేశ పూర్వక దిశా నిర్దేశం గావించారు. భక్తిలో అంతర్లీనంగా పాలలో వెన్నలా దాగిన వైరాగ్యం పూజ్య గురుదేవులను జ్ఞాన మార్గంలో అత్యున్నత అద్వైత శిఖరాలకు చేర్చి జీవన్ముక్తులుగా నిల్పిన విశేషాలను గత సందేశాలలో తెలుసుకున్నాం. ఆ శిఖరాల మూలాలను పూజ్య గురుదేవులు ప్రస్తుత సందేశంలో స్పృశించారు.



భక్తి - జ్ఞాన - వైరాగ్యాలు అవిభాజ్యములని పూజ్య గురుదేవుల వ్యాఖ్యలు మనకు విశదం చేస్తాయి. పూవ వయసులో మొగ్గ తొడిగిన తమ భక్తి, జ్ఞాన కుసుమంగా విరబూయడం కేవలం శ్రీకృష్ణ పరమాత్మ కరుణా కటాక్ష ఫలమని పూజ్య గురుదేవులు సభక్తికముగా తెలియజేయడమే ఇందుకు తార్కాణం. ఒక్క చిన్న వివరణతో ఈ అవగాహనా ప్రయత్నాన్ని సమాప్తం చేసుకుందాము.


ఇది పూజ్య గురుదేవులు వివరించిన 'తిరువలంగాడు' గ్రామ అనుభవంలో రుజువైన సత్యం. శ్రీకృష్ణ పరమాత్మ పూజ్య గురుదేవులను లోక కళ్యాణార్థం మానవాళికి ప్రసాదించగా, పూర్ణ వైరాగ్యంతో తాము వ్యక్తిగతంగా సంకల్పించిన 'భిక్షాటన' అనే జీవన విధానానికి తమను పరిమితం కాకుండా చేయడం కేవలం కృష్ణలీలగా గురుదేవులు వ్యాఖ్యానించారు. లక్షలాది జీవితాలను ప్రభావితం చేసి మోక్ష మార్గం లోకి మళ్ళించ గల్గడం అవతార పురుషులకే సాధ్యమయే అద్భుత కార్యం. భక్తి జ్ఞాన వైరాగ్యాలను సమపాళ్ళలో రంగరించి శాస్త్రీయ బోధనా విధి ననుసరించి వేదాంత విజ్ఞానాన్ని ఇన్ని లక్షల మంది ముముక్షువులకు, జిజ్ఞాసువులకు వితరణ చేసిన మరొక అవతారాన్ని ఈ రెండు శతాబ్దాల్లో పూజ్య గురుదేవులు మినహా ప్రపంచం చూడలేదు.

శ్రీకృష్ణుని తప్ప మరొక స్మరణ తెలియని అనన్య భక్తి, శ్రీకృష్ణుని తప్ప మరొక వస్తువును ఆశించని వైరాగ్యం తమకు ఇంతటి మహోద్యమాన్ని నిర్మించి ఆరు దశాబ్దాలుగా నడిపించే అవకాశాన్ని ప్రసాదించినట్లు పూజ్య గురుదేవులు స్వానుభవ పూర్వకంగా వివరిస్తూ తమ దివ్య సందేశాన్ని ఎంతో స్ఫూర్తి దాయకంగా సమాప్తం గావించారు.

అనంతరం 'ఇందువదన శ్యామ', 'కేశవ మాధవ గోవింద' భజనలను పూజ్య గురుదేవులు గానం చేస్తూ అందరితో పాడించారు.

భగవాన్ శ్రీకృష్ణ ముఖచిత్రంతో పన్నెండు భజనలు, ఇతర ఛాయా చిత్రాలతో ఒక చిన్న పుస్తకాన్ని, మధుర పదార్థాలను ప్రసాదంగా పూజ్య గురుదేవులు తమ అమృత హస్తాలతో అందరికీ ఆశీః పూర్వకంగా అందించారు. తిరిగి గురుగోవిందుల రథయాత్రతో సాయంకాల వేడుకలు సమాప్తం కాగా, బాలకృష్ణుని డోలారోహణ వేడుకను సర్వ సందర్భనార్థం మురళీకృష్ణాలయంలో నెలకొల్పడంతో కృష్ణాష్టమి వేడుకలు సంపూర్ణ మయాయి.

(సర్వమ్ శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానంద సద్గురు దివ్య చరణారవిందార్పణ మస్తు!)






మల్కాజ్‌గిరి
హైదరాబాద్











స్వామీజీ లేఖ

ఆత్మ బంధువులారా,
ఓం నమో భగవతే వాసుదేవాయ.

తల్లి నుండి మనం ఆవిర్భవించాము కనుక తల్లిని ప్రేమిస్తాము. జన్మ నిచ్చింది తండ్రి కనుక తండ్రిని ప్రేమిస్తాము. దేహానికి సంబంధించినవారు కావటంచేత బంధువుల్ని ప్రేమిస్తాము. మనస్సుకు అనుకూలు రైనందున స్నేహితుల్ని ప్రేమిస్తాము. జీవనయాత్రలో సహచరులైన సహోద్యోగులు మొదలైనవారి నందరిని ప్రేమిస్తాము. జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు కనుక గురువును ప్రేమిస్తాము.

సంబంధాలలో ప్రేమ జనిస్తుంది. ఆ తరువాత పెరుగుతుంది. కాని, ఏ సంబంధం లేకుండా సాగే ప్రేమలో అనురక్తి ఏమిటో, ఆసక్తి దేనికో అర్థం చేసుకోవాలి.

నవ్వే పువ్వుల్ని ఎందుకు ప్రేమిస్తాము? పువ్వుల్లా నవ్వే పిల్లల్ని ఎందుకు ప్రేమిస్తాము? ఎగిరే గువ్వలు, పారే నదులు, పొంగే సాగరం, పండ్లభారంతో వంగిన వృక్షాలు, ఆడే నెమలి, పాడే కోకిల - ఇవన్నీ మన హృదయాలను దోచేసుకుంటాయి. ఈ విధమైన ప్రేమల వెనుక ఏ సంబంధ ముంది? ఉంది.

ఏ సంబంధం లేకపోతే ప్రేమ ఎలా సాగుతుంది? నవ్వులు మన కున్నాయి. పొంగే మనస్సు మనకుంది. ఆటలు మనకి క్రొత్తవి కావు. పాటలు మనకు పాతవే. నడకలు, పరుగులు, ఎగుర్లు, దుముకుళ్ళు మనకు తెలియనివి కావు. ఇవన్నీ మనో పరిధిలో అనుభవ చలనాలు.

కానీ, నవ్వులు, నవ్వుల కారణాలు భిన్నంగా ఉన్నా, ఆ నవ్వుల వెనుక నవ్వించే శక్తి ఏదో ఉంది. అందరి మాటలు ఒక విధంగా లేకున్నా, మాట్లాడించే శక్తి అందరిలో ఒక్కటే. చూపులు వేరైనా, చూచే శక్తి అందరిలో ఒక్కటే. ఆలోచనలు మనిషికి మనిషికి వేరుగా తెలుస్తున్నా, ఆలోచనలకు ఆధారమైన శక్తి అందరిలోను ఒక్కటే. అందరిలో భాసించే ఒకే శక్తి తనను తాను ఆకర్షించుకొంటోంది.

ఒకరి శక్తి మరొకరి శక్తిని, ఒకరి జ్ఞానం మరొకరి జ్ఞానాన్ని ఆకర్షిస్తోంది. ఇదొక గొప్ప ఆకర్షణ. ప్రేమ. దివ్యమైన ప్రేమ. విచిత్రమైన సంబంధము. మనకు తెలిసిన సంబంధములవంటి సంబంధము కాదిది. ఇదేదో అర్థంగాని సంబంధం. పరమార్థానికి సంబంధించిన సంబంధం.

అన్యములైన సంబంధాలలో ప్రేమ పెరిగితే పెరగవచ్చు; కాని తరగదని చెప్పలేము.

తిరిగితే తిరగవచ్చు; కాని అరగదని చెప్పలేము. పారమార్థిక ప్రేమ తరిగేది కాదు; అరిగేది కాదు. అది ఇరువురి మధ్య ఆగే ప్రేమ కాదు; ఇరువురిలోని ఒకే చైతన్యములో సాగే దివ్య ప్రేమ. ఒకే చెట్టులో పక్వమైన ఫలాలలోని రసం లాంటిది. ఒకే నదిలో వేర్వేరు రేవులలో లభించే జలం వంటిది.

మనిషి ఎప్పుడూ నవ్వలేడు. కాని, నవ్వగలిగే శక్తిని ఎప్పుడూ కలిగియున్నాడు. మౌనంగా ఉన్నంత మాత్రాన మాటలు రావని కాదు. మన నుండి కదిలే ఆలోచనల వెనుక, మన నుండి సాగే మాటల నడుమ, మనకు తెలిసే విషయాల మధ్య మౌనంగా, మర్మంగా ఉన్న దెవరో తెలిస్తే, ఆ తరువాత ఒక అందమైన అలౌకిక వాతావరణాన్ని ఆంతర్యంలో అవలోకించటం జరుగుతుంది. ఆంతర్యంలోని అందాలే బాహ్యంలో ఆరబోసుకోవటం జరుగుతుంది. బాహ్యాభ్యంతరాలలో ఒకే అందం, ఒకే సౌందర్యం, ఒకే ఆనందం, ఒకే వీక్షణం దోబూచు లాడుతుంది. అదొక దివ్యానుభూతి. దివ్యమైన అద్వైతానుభూతి.

అది అనుభూతి మాత్రమే కాదు; అద్భుతం. స్వల్పాలను, అల్పాలను అన్వయం చేసే అద్వితీయం. పరిమితాలను పరిపూర్ణంగా దర్శింపచేసే అదృష్టము. ఆవేదనలను అంతంచేసే ఆనందము. అంధకారాన్ని అదృశ్యంచేసే దివ్యధామము. పరంధామము.

అందచందాలతో, స్వేచ్ఛానందాలతో ప్రకృతి పరవశించి నాట్యం చేస్తోంది. పరమాత్మ సృష్టిలో మకుటం లాంటి మానవా! దుఃఖించుట ఇకనైనా మానవా? స్వార్థపు సంకెళ్ళను ఇప్పుడైనా త్రెంచుకోవా?

దివ్యమైన ప్రేమను కదలనీ. గుండె గోడల్ని అంటుకొని ప్రాకనీ. సుగంధ పరిమళాలతో ప్రాకిపోనీ. కర్పూరజ్యోతిలా వెలిగిపోనీ.

అనుక్షణము తలుపు తడుతూనే వుంది పిలుపు. మగతను వీడు. కునుకును విడిపోనీ. నీవు విడి ఉండు. ప్రేమను వీడకుండా ఉండు. తెరలు తొలగిపోనీ. దొరలా నీవు వెలిగిపో.

వెను దిరిగి చూడకు. వెన్ను ద్రిప్పి నడవకు. రాలేందుకున్నవి రాలిపోనీ. సాగేందు కున్నవి నడచిరానీ.

బాధలను తొలగించుకొనే ప్రయత్నంలో మిగిలేదంతా బాధే. బోధల నడుమ బాధలను మరపురానీ. మనసు వాటిని మరచిపోనీ. మార్చటం - మారటం రెండూ ఒక్కటే. మార్చటంలో ఏం జరుగుతుందో మారటంలో అదే మిగుల్తుంది. కాకపోతే, మార్చటం కష్టతరం. మారటం శ్రేయస్కరం. నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి.

ఉద్ధరేదాత్మనాఽఽత్మానం

అని భగవంతుని మాట. అమృతమయమైన తియ్యని పాట.

మీ

ఓం స్వామి సుందర చైతన్యానంద

